నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY




సంపుటి : 13 సంచిక : 129 రంగారెడ్డి | మంగళవారం 08 సెప్టెంబర్ 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 08-09-2026 | September | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To:Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy-Siddipet-Medchal-Jagityal-Vemulawada

# కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

**అధికారం కోసం బీజేపీ అడ్డదారులు**

**2029లో మోదీ ఓటమికి పునాది**

**లౌకిక శక్తులు ఏకం కావాలి**

**సీఎం రేవంత్‌రెడ్డి**

నిర్భయవార్త ప్రతినిధి : తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓటర్లను గుర్తించేందుకు ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసి, 2009 నుంచి వారి ఓటింగ్ సరళిని పరిశీలిస్తూ ఓట్ల తొలగింపునకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించిన రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభలో సీఎం మాట్లాడారు. ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరతీశారని విమర్శించారు. తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపునకు జరుగుతున్న ప్రయత్నాలపై బీఆర్ఎస్ స్పందించకపోవడాన్ని తప్పుబట్టారు.

**కొడంగల్‌లో 81 వేల ఓట్లు**

తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన పేదల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు కేవలం మైనార్టీలవేనని భావించరాదని, పేదలు, గిరిజనుల ఓట్లను కూడా తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా లౌకిక శక్తులన్నీ ఏకమై ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

**సారంపల్లి సేవలు చిరస్మరణీయం**

రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి సేవలు చిరస్మరణీయమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన మరణం రైతాంగానికి తీరని లోటని పేర్కొన్నారు. కౌలు రైతుల సమస్యలు, గిట్టుబాటు ధర తదితర అంశాలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. కమ్యూనిస్టు ఉద్యమాలు, పోరాటాల ఫలితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం పలు కీలక చట్టాలను తీసుకొచ్చిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు సాగించిన పోరాటాలు కాంగ్రెస్ ప్రభుత్వాల ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని అన్నారు.



## బ్లాక్ టీషర్ట్‌లతో వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకున్న పోలీసులు

- తీవ్ర వాగ్వాదం.. తోపులాట.. కేటీఆర్, జగదీశ్‌రెడ్డికి గాయాలు
- టీషర్ట్ విప్పి బనియన్‌తో హరీశ్‌రావు నిరసన
- కేటీఆర్, హరీశ్ సహా పలువురు అరెస్టు
- 'రాహుల్ బ్లాక్ డ్రెస్ వేసుకుంటే ఒప్పు.. మేం వేసుకుంటే తప్పా?': తలసాని

నిర్భయవార్త ప్రతినిధి : తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే అసెంబ్లీ ప్రాంగణం రణరంగంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలను నిరసిస్తూ నల్ల టీషర్ట్‌లు ధరించి అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. అనంతరం కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని వాహనాల్లో తెలంగాణ భవన్‌కు తరలించి అనంతరం విడిచిపెట్టారు.




### 'చర్చించే ధైర్యం లేకే అరెస్టులు'

అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాలని పిలిచి.. సభలోకి వెళ్లకముందే ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించే ధైర్యం లేకే ప్రభుత్వం అరెస్టులకు పాల్పడుతోందని ఆరోపించారు. పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించి ప్రజాప్రతినిధులను అడ్డుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై నిరసన తెలిపేందుకే నల్ల టీషర్ట్‌లతో వచ్చామని, సభలోకి వెళ్లకముందే అడ్డుకోవడం సరికాదని అన్నారు.

### 'పోరాటం ఆపేది లేదు': కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరును తప్పుబడుతూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తమను ఎంతమందిని అరెస్టు చేసినా ప్రజా సమస్యలపై పోరాటం ఆపేది లేదని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల తొలిరోజే ప్రతిపక్ష ఎమ్మెల్యేల నిరసన, పోలీసుల అడ్డంకులు, అరెస్టులతో అసెంబ్లీ పరిసరాల్లో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

### 'రాహుల్‌కు ఒప్పు.. మాకు తప్పా?'

బీఆర్ఎస్ మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌కు రాహుల్‌గాంధీ నల్ల టీషర్ట్ ధరించి వెళ్లొచ్చని, తెలంగాణ అసెంబ్లీకి బీఆర్ఎస్ సభ్యులు నల్ల టీషర్ట్‌లతో రావద్దా? అని ప్రశ్నించారు. "రాహుల్ బ్లాక్ డ్రెస్ వేసుకుంటే ఒప్పు.. మేం వేసుకుంటే తప్పా?" అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం సరికాదన్నారు.

### తొలిరోజే ఉద్రిక్తత

అసెంబ్లీ సమావేశాల తొలిరోజే ప్రతిపక్ష ఎమ్మెల్యేల నిరసన, పోలీసుల అడ్డంకులు, తోపులాట, అరెస్టులతో అసెంబ్లీ పరిసరాల్లో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ విమర్శలు మరింత తీవ్రం అయ్యే అవకాశముంది.

# ఫీజు బకాయిలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- జీవో నంబర్ 97 రద్దు చేయాలి తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత



రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, పాలిటెక్నిక్ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నంబర్ 97ను రద్దు చేయాలని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం హనుమకొండ అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒకసారి ఇంటర్మీడియట్ విద్యా విధానాన్ని తొలగిస్తామని, మరోసారి పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేస్తామని ప్రకటిస్తూ విద్యార్థులను అయోమయానికి గురిచేస్తున్నారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో లక్షలాది మంది డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసినప్పటికీ సర్టిఫికెట్లు అందక ఉద్యోగాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు బకాయిలు చెల్లించడం లేదని, విద్యార్థులకు ఇస్తామన్న స్కూటీలను కూడా అందించడం లేదని ఆరోపించారు. సోమవారం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం చర్చించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పూర్తిగా చెల్లించే వరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు లయన్ వెంకటేశ్వరరావు, నాయకులు వీరభిక్షపతి, మరిపల్లి మాధవి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

హైదరాబాద్ :నిర్భయవార్త ప్రతినిధి : ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం పట్ల ఎంతో పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని మహాత్మా జోతిబాపూలే ప్రజాభవన్‌లో ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ట్రస్ట్ బోర్డు (ఈహెచ్‌సీటీ) సభ్యులు, ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి భట్టి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, డిపెండెంట్ల ఆరోగ్య భద్రత కోసం తీసుకొచ్చిన నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తుందని చెప్పారు. దశాబ్దాలుగా ఉద్యోగులు ఎదురుచూ స్తున్న సమస్యను మానవీయ కోణంలో పరిష్కరిం చాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. ప్రభుత్వంలో పనిచే స్తున్న ఉద్యోగులంతా తమవారేననీ, వారు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని అన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, డిపెండెంట్లు గానీ అనారోగ్యానికి గురైనప్పుడు ఆర్థిక, మానసిక ఇబ్బందులకు గురికాకూడదన్న ఉన్నతమైన ఆశయంతోనే అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం రూపకల్పన, విధివిధానాల విషయంలో ఉద్యోగ సంఘాలతో అనేకసార్లు సమావేశాలు నిర్వహించి, వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నామని వివరించారు. ఉద్యోగుల గురించి మానవీయ కోణంలో ప్రజాప్రభుత్వం తెచ్చిన పథకాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు.

నిర్భయవార్త

సంపాదకీయం

మంగళవారం 08 సెప్టెంబర్ 2026

# టిటిడి బోర్డు సమావేశాలు కొండపైనే ఎందుకు?

తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సమావేశాలు తిరుమల కొండపై నిర్వహించడం ఒక ఆనవాయితీగా మారిపోయింది. అయితే ఈ ఆనవాయితీని ఇప్పుడు సమీక్షించాల్సిన అవసరం ఉంది. టిటిడి ప్రధాన పరిపాలనా కార్యాలయం తిరుపతిలోనే ఉంది. ఇ.ఓ కార్యాలయం, జె.ఇ.ఓ కార్యాలయాలు, విజిలెన్స్ పరిపాలన వ్యవహారాలు నుంచి ఇంజనీరింగ్, ఎస్టేట్స్, విద్య, వైద్యం, మార్కెటింగ్, ప్రొక్యూర్‌మెంట్, ఉద్యోగుల సంక్షేమం, ఆర్థిక వ్యవహారాలే కాకుండా 15 రకాల ట్రస్టులు, ఎస్.వి భక్తి ఛానల్ తదితర ప్రధాన శాఖలన్నింటి పరిపాలనా వ్యవస్థ తిరుపతిలోనే కేంద్రీకృతమై ఉంది. అలాంటప్పుడు పాలకమండలి సమావేశాలను తిరుమలలో నిర్వహించాల్సిన అవసరం ఏమిటన్నది టిటిడి స్పష్టంగా చెప్పాలి. పాలక మండలి సమావేశం ఉందంటే ముందురోజు నుంచే తిరుమలలో ఏర్పాట్లు మొదలవుతాయి. బోర్డు సభ్యులు, అధికారులు, ఆహ్వానితులు, వారి వెంట వచ్చే వారికి వసతి కల్పించేందుకు అనేక గదులు కేటాయించాల్సి వస్తుంది. పద్మావతి నగర్ ప్రాంతంలోని గదులతో పాటు, సన్నిధానం లాంటి ఇతర అతిథి గృహాలను బ్లాక్ చేస్తున్నారు. సాధారణ భక్తులకు కేటాయించాల్సిన గదులు పరిమితమవుతాయి. రవాణా, భద్రత, దర్శన ఏర్పాట్లపై అదనపు భారం పడుతుంది. పాలకమండలి సభ్యులకు సమావేశానికి ముందు, సమావేశం రోజు లేదా అనంతరం దర్శనాలు ఏర్పాటు చేయడం కూడా ఒక సాధారణ పద్ధతిగా మారిపోయిందనే విమర్శలు ఉన్నాయి. అధికార యంత్రాంగం మొత్తం కొండపైకి ఎందుకు? టిటిడి పాలకమండలి సమావేశం ఒక చిన్న సమావేశం కాదు. టిటిడి పరిధిలో అధికారికంగా అనేక శాఖలు ఉన్నాయి. స్విమ్స్, చిన్నపిల్లల ఆసుపత్రి, విద్యాసంస్థలు, ట్రస్టులు, స్థానిక ఆలయాలు, ఇంజనీరింగ్ విభాగాలు, ఆరోగ్య సంస్థలు కలిపి చూస్తే ఇది ఒక సచివాలయం తరహాలో పనిచేసే విస్తృత వ్యవస్థ. పాలకమండలి ఎజెండాలో ఇంజనీరింగ్ అంశం ఉంటే చీఫ్ ఇంజనీర్ నుంచి సంబంధిత అధికారులు హాజరవ్వాల్సి ఉంటుంది. కొనుగోళ్లపై అంశం ఉంటే మార్కెటింగ్, ప్రొక్యూర్‌మెంట్ అధికారులు రావాలి. విద్యాసంస్థలపై చర్చ ఉంటే విద్యాశాఖ అధికారులు, ఆసుపత్రులు, ఆరోగ్య అంశాలపై చర్చ ఉంటే వైద్య విభాగం అధికారులు రావాలి. ఎస్టేట్ వ్యవహారాలు, భూములు, ఆలయాల నిర్మాణం, శ్రీవాణి ట్రస్టు ద్వారా చేపట్టే ఆలయ నిర్మాణాలు, ఉద్యోగుల సర్వీస్ నిబంధనలు, పోస్టుల సృష్టి, వేతనాలు, ప్రభుత్వ పే స్కేళ్ల అమలు, అనామలీస్, సంక్షేమ పథకాలు ఇలా అనేక అంశాలకు సంబంధించిన ఫైళ్లు, అధికారులు సమావేశానికి అవసరమవుతారు. ఇవన్నీ తిరుపతిలోని పరిపాలనా భవనంలోనే అందుబాటులో ఉండగా, అధికారులు ఫైళ్లతో సహా తిరుమలకు వెళ్లాల్సిన అవసరం ఏమిటి? పరిపాలనా భవనమే సరైన వేదికతిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనంలో బోర్డు సమావేశాలను నిర్వహిస్తే... అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారు. అవసరమైన ఫైళ్లను వెంటనే తెప్పించుకోవచ్చు. ఒక అంశంపై అదనపు సమాచారం కావాలంటే సంబంధిత అధికారిని వెంటనే పిలిపించుకోవచ్చు. సాంకేతిక వివరాలు, ఆర్థిక గణాంకాలు, పాత తీర్మానాలు, ప్రభుత్వ ఉత్తర్వులు వంటి సమాచారాన్ని సులభంగా పరిశీలించవచ్చు. దీంతో సమావేశాల్లో లోతైన చర్చకు అవకాశం ఉంటుంది. అధికారులకు కూడా తిరుమలకు ప్రయాణం, అక్కడ వసతి, వాహనాలు, ఇతర ఏర్పాట్ల అవసరం తగ్గుతుంది. బోర్డు సభ్యుల సంఖ్యపై కూడా సమీక్ష అవసరంగతంలో టిటిడి పాలక మండళ్లు పరిమిత సంఖ్యలో గరిష్టంగా 12 మందితో ఉండేవి. కాలక్రమేణా రాజకీయ పునరావాసంలో భాగంగా పాలకమండలి సభ్యత్వాలను ఉపయోగిస్తున్నారనే విమర్శలు పెరిగాయి. ప్రస్తుతం చైర్మన్ సహా అధికారిక సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యులు, ఇ.ఓ తదితరులను కలిపితే బోర్డు సంఖ్య దాదాపు 29కు చేరుతోంది. ఇంత పెద్ద బోర్డు నిజంగా సమర్థవంతమైన పరిపాలనకు అవసరమా? లేక రాజకీయ సమతుల్యత కోసం సంఖ్యను పెంచుతున్నారా? అనే అంశంపై కూడా చర్చ జరగాలి. సమావేశం ఒక 'తంతు'గా మారకూడదుటిటిడి వార్షిక బడ్జెట్, కోట్ల రూపాయల కొనుగోళ్లు, నిర్మాణాలు, భూములు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, ఉద్యోగుల సమస్యలు, ఆలయాల నిర్వహణ వంటి అత్యంత ముఖ్యమైన అంశాలు బోర్డు ముందు వస్తాయి. ప్రతి అంశంపై సమగ్ర పరిశీలన జరగాలి. సంబంధిత శాఖల అభిప్రాయం తీసుకోవాలి. ఆర్థిక ప్రభావాన్ని అంచనా వేయాలి. ప్రజా ప్రయోజనం, భక్తుల ప్రయోజనం, ఉద్యోగుల ప్రయోజనం దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలి. అయితే సమావేశానికి రావడం, దర్శనం చేసుకోవడం, కొన్ని ఎజెండాలకు ఆమోదం తెలపడం, సంతకాలు చేసి వెళ్లిపోవడం వంటి పరిస్థితి ఏర్పడితే పాలకమండలి అసలు ఉద్దేశమే దెబ్బతింటుంది. అనుబంధ సంస్థల సమావేశాల పరిస్థితి కూడా మారాలిస్విమ్స్ వంటి పెద్ద వైద్య సంస్థలకు, గవర్నింగ్ కౌన్సిల్ కు ఛైర్మన్ గా టిటిడి ఛైర్మన్ ఉంటున్నారు. ఇలాంటి సంస్థలకు సంబంధించిన సమావేశాలను కూడా టిటిడి బోర్డు సమావేశాలకు అనుబంధంగా అరగంటో, గంటో నిర్వహించి ముగించడం సరైన పద్ధతి కాదు. ఆసుపత్రుల అభివృద్ధి, వైద్య పరికరాలు, నియామకాలు, రోగుల సేవలు, ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై ప్రత్యేక సమయం కేటాయించి సమగ్రంగా చర్చించాలి. అదే విధంగా ట్రస్టులు, విద్యాసంస్థలు, ఇతర అనుబంధ సంస్థలకు సంబంధించిన సమీక్షలు కూడా వాటి ప్రాధాన్యతకు తగిన విధంగా నిర్వహించాలి. టిటిడి తీసుకోవాల్సిన నిర్ణయాలుతిరుమల ఆధ్యాత్మిక కేంద్రంగా ఉండాలి. తిరుపతి పరిపాలనా కేంద్రంగా పనిచేయాలి. టిటిడి పాలకమండలి సమావేశాలను సాధారణంగా తిరుపతిలోని పరిపాలనా భవనంలోనే నిర్వహించే విధానాన్ని ప్రవేశపెట్టాలి. అత్యంత ప్రత్యేకమైన లేదా తిరుమలకు నేరుగా సంబంధించిన అంశం ఉన్నప్పుడు మాత్రమే అవసరమైతే తిరుమలలో సమావేశం నిర్వహించవచ్చు. బోర్డు సభ్యుల సంఖ్యను కూడా ప్రభుత్వం పునఃసమీక్షించాలి. పరిపాలనకు అవసరమైన మేరకు మాత్రమే సభ్యత్వాలను పరిమితం చేయాలి. బోర్డు సభ్యులతో పాటు సమావేశాలకు వచ్చే వారి సంఖ్యకు స్పష్టమైన పరిమితులు విధించాలి. సమావేశాల కారణంగా భక్తులకు కేటాయించే వసతి గదులను బ్లాక్ చేయకుండా చూడాలి. ప్రత్యేక దర్శనాల విషయంలో కూడా నియంత్రణ అవసరం. పాలకమండలి సమావేశం ఒక పరిపాలనా బాధ్యతగా ఉండాలి తప్ప ప్రత్యేక దర్శనాల అవకాశంగా మారకూడదు.

# పదవులూ ప్రాపకాల వివాదాలేనా...!

ఇటీవలి కాలంలో దేశంలోనూ మరీ ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో మార్పులూ చేర్పులూ ఆసక్తినే గాక ఆలోచననూ కలిగిస్తున్నాయి. పాలక పార్టీలలో కొందరు కీలక నాయకులూ మంత్రులూ అటూ ఇటూ మారుతున్నారు. ఫిరాయింపులపై కోర్టులలో కేసులే నడుస్తున్నాయి. తాము అధికారంలో వున్నప్పుడు ఇబ్బడిముబ్బడిగా ఇతరులను చేర్చుకున్నవారే ఇతరులకు నైతిక సూత్రాలు చెబుతున్నారు. బయటి నుంచి వచ్చిన వారికి పెద్ద పీట వేస్తూ ఎప్పటి నుంచో వున్న తమను విస్మరిస్తున్నారని వాపోతున్నారు. అత్యంత విధేయులుగా కుడి భుజాలుగా చలామణి అయినవారే మాజీ బాస్‌లకు షాక్‌లిస్తున్నారు. వారూ అదే స్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. పూర్వాశ్రమంలో అధికార యంత్రాంగంలో, పోలీసు వ్యవస్థలో వుండి రకరకాల ముద్రలేయించుకున్న వారు తర్వాత అందుకు భిన్నంగా మాట్లాడుతూ ప్రజల్లోకి వస్తున్నారు.



ఇక మీడియా కథనాలూ వ్యాఖ్యానాలూ కూడా వార్త స్వభావం కోల్పోయి అటో ఇటో ప్రచారం ప్రధానమైపోతున్నది. మొత్తంగా పత్రికల ప్రాచుర్యం తగ్గుతున్నదంటుంటే మీడియా కూడా నిర్ణీత, నిర్దేశిత ఎజెండాలతో నడుస్తున్నదని బొద్దింకల తిరుగుబాటుతో సహా అన్ని సందర్భాల్లో రుజువవుతున్నది. స్థూల జాతీయోత్పత్తినీ రేటింగును అంచనా వేసే సమయంలో మరింత వాస్తవికంగా వ్యవహరించాలని గౌతం అదానీ బహిరంగంగా పిలుపునివ్వడం ఇందుకో తాజా ఉదాహరణ మాత్రమే. ఇప్పుడు పార్టీలలో మార్పులు, చేర్పులు, చేరికలూ నిష్క్రమణల వెనక కూడా నిర్దిష్ట ప్రభావాలు వున్నాయని సాధారణ ప్రజానీకం కూడా భావిస్తున్న పరిస్థితి. సరళీకరణ యుగంలో ప్రజాస్వామ్య వ్యవస్థ సారాన్ని దెబ్బతీసి కార్పొరేట్ వాణిజ్య వర్గాల ప్రాబల్యమే రాజ్యమేలుతున్న తీరుకు ఇవన్నీ నిదర్శనాలుగా భావించవలసి వుంటుంది.

### వ్యక్తిగత తగాదాల చుట్టూనే...?

ఈ మొత్తం పరిణామాలలో కొట్టవచ్చినట్టు కనిపించే అంశమేమంటే నిష్క్రమణలూ చేరికలూ విడిపోవడాలూ కొత్త స్థాపనలూ కలయికలూ అన్నిట్లోనూ సామాజిక ప్రజా ఎజెండాలకన్నా వ్యక్తిగత వ్యవహారాలే ముందుకు రావడం. బిఆర్ఎస్ అధినేతపై కుటుంబంపై తిరుగుబాటు చేసిన కవిత, వైసిపి నుంచి వైదొలగిన విజయసాయి రెడ్డి, రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి తొలగించబడిన కొండా సురేఖ, కొంతమంది మాజీ అధికారులు నిర్ణయాలు ఏం తీసుకున్నా వ్యక్తిగత విషయాలే ప్రధానంగా చెబుతున్నారు. సమాజం, రాజకీయాలు తర్వాత వస్తున్నాయి. రాజకీయ తేడాలు గాక వ్యక్తిగత కోణాలలో వస్తున్నారు గనకే తామెక్కడ ఏ విషయంలో విభేదించామో చెప్పలేకపోతున్నారు. పైగా తాము విశ్వసనీయంగా వున్నా అవతలివారే తమను అవమానించారని లేక తమను కాదని మరెవరినో ఎంచుకున్నారని ఆరోపిస్తున్నారు. ఇంకా చెప్పాలంటే జానపద చిత్రాల్లోలాగా రాజు మంచివారే... సేనాపతి, మంత్రులదే తప్పు అని చెబుతున్నారు. దానికి తగినట్టే ఆయా పార్టీల నాయకులు కూడా విధాన పరంగా ఖండించకుండా వ్యక్తిగత దాడులు లేదా విశ్వాస ఘాతుకత అంటూ తిట్టిపోస్తున్నారు. వ్యక్తిగతంగా వారి పదవులూ కోపతాపాలకు తోడు కుటుంబాల కథలూ వ్యథలూ మరీ ముఖ్యంగా మహిళలను కించపర్చే దుష్ప్రచారాలు వివాదాలుగా వీడియో ఆడియో లీకులతో ఆరోపణలూ అభాండాలే నిండిపోతున్నాయి. ముందే చెప్పిన మీడియా కూడా వారి అనుబంధాలనూ ప్రయోజనాలనుబట్టి అటో ఇటో చిత్రిస్తూ తికమక పరుస్తున్నది. అవినీతి ఆరోపణలు, అక్రమ వ్యవహారాలు కూడా ఈ అనుబంధాలను బట్టి చూపించడం తప్ప విలువలు, వాస్తవాలను బట్టి జరగడం లేదు. ఉపాధి, ఉద్యోగాల కల్పన, వ్యవసాయం, ధరల పెరుగుదల, శాంతిభద్రతలు, సామాజిక వివక్ష, దేశ సార్వభౌమత్వం, ప్రపంచశాంతి వంటి ముచ్చట్లే మాయమైపోతున్నాయి. ఏమంటే వీరెవరూ పొరబాటున కూడా వాటి జోలికి పోరు. పైన చెప్పిన చాలా వివాదాలపై మీడియా హడావుడిలో పొరబాటునైనా జాతీయ అంతర్జాతీయ పరిణామాలు ప్రస్తావించడమే జరగదు. పైగా ఇప్పుడు మోడీ యుగంలో తిష్ట వేసుకున్న మతతత్వ, హిందూత్వ రాజకీయ భావజాలాన్నే రకరకాల మెలికలతో వినిపించి వీరతాడు వేసుకోవడానికి పాకులాడుతుంటారు. ఏమంటే తమపై ఒత్తిడి అంత తీవ్రంగా వుందంటారు. అవతలివారిని పోటీగా చూపించి సమర్థించుకుంటారు. అసలు మోడీకి ఎవరు ఎక్కువ దగ్గరనేదానిపైనా ఈ పార్టీల నేతల మధ్య గొప్ప పోటీ నడుస్తుంటుంది. కనుకనే లౌకికతత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం వంటి పదాలు చాలామంది గొంతులో అసలు పలకవు. స్థానిక అధికార పోటీ ప్రయోజనాలే దృష్టిలో వుంచుకుని మోడీ సర్కారు పట్ల ప్రశంసలు లేదా మెతకదనం ప్రదర్శిస్తుంటారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోడీని 'బడే భాయ్' అనడంపై చాలా చర్చ నడిచింది. ఇప్పుడాయన అసదుద్దీన్ అక్బరుద్దీన్ ఒవైసీలు కూడా మోడీ, అమిత్ షాల లాగే దేశభక్తులని పాత బస్తీ నుంచి ప్రకటించగానే కేంద్ర మంత్రులు దాడి ఎత్తుకున్నారు. మతతత్వ రాజకీయాలు ఏవైనా పొరబాటే. అయితే మతాన్ని, దేశభక్తినీ కలగాపులగం చేయడం కూడా తప్పవుతుంది. కృత్రిమ వివాదాలకే ఇవన్నీ పనికి వస్తాయి. ?

### అంతర్గత వ్యవహారాలే...

కొండా సురేఖది తప్పా, అధిష్టానానికి తప్పా అనేది వారి అంతర్గత అంశం. విజయసాయి రెడ్డి రైటా, సజ్జల రామకృష్ణారెడ్డి రైటా... ఎవరిపైన కేసులు పెట్టారు, ఎవరిపై ఎందుకు పెట్టలేదు అనేది కూడా వారి అంతర్గత వ్యవహారమే. కవితకూ కుటుంబానికి మధ్య జరిగిందేమిటన్నది అసలే ప్రజలకు సంబంధించిన విషయం కాదు. గతంలో పాలించిన కెసిఆర్, జగన్ ప్రభుత్వాల విధానాల మంచి చెడ్డలూ ప్రజలకు జరిగిన లాభనష్టాలు ప్రజాస్వామ్య విధానాలు వాటిలో ఇప్పుడు రావలసిన మార్పులు సమాజానికి సంబంధించినవి. ఇప్పుడు పాలన చేస్తున్న చంద్రబాబు నాయుడు-పవన్ కల్యాణ్, రేవంత్ రెడ్డి- భట్టి విక్రమార్క ప్రభుత్వాలకూ అదే వర్తిస్తుంది. వీరిలో ఎవరు ఎప్పుడు ఎవరికి ఎంత ప్రాధాన్యత ఇచ్చారు? ఏ పదవులు ప్రసాదించారు? ఏవి నిరాకరించారు? ఎప్పుడు ఏ తగాదాలు వారిని విడదీశాయి? వీటితో జనానికి సంబంధమేమిటి? రాజకీయ విమర్శలు, ఆరోపణల విషయానికి వస్తే వారేం చేశారు? చేస్తున్నారనే దానిపై లేదా కేసులు ఆరోపణలపై న్యాయస్థానాలు నిర్ణయాలు తీసుకోవాలి. వీటిని ఎడతెగని పంచాయితీలుగా మార్చి రోజుల తరబడి మీడియా చర్చలనూ రాజకీయ సంవాదాలను సాగదీసుకోవడం అసలు చర్చను పక్కదోవ పట్టించడానికి కూడా కారణమవుతుంటుంది. ఎందుకంటే వీరిలో చాలామంది అటూ ఇటూ ఎప్పుడైనా కలిసిపోతుంటారు. లక్షల కోట్ల విలువైన సంపదలూ సంస్థలను శాసించే అదానీలు అంబానీల పాత్ర అందరి వెనకా వుంటుంది. అసలు ఈ చర్చలలో చాలా భాగం వ్యాపార లావాదేవీలు, కుంభకోణాలలో మునిగి తేలుతుంటుంది. 'కూరిమి కలదినములలో నేరములెన్నడు కలగనేరవు' అన్నట్టు వారు బాగున్నప్పుడు కప్పిపుచ్చుకుని తర్వాత మొత్తం దాడులు చేసుకుంటే ఎవరికైనా విలువేముంటుంది? ఆయా సర్కార్లలో కీలక అధికారులగా చక్రం తిప్పిన వారు చాలా విషయాలు సోదాహరణంగా సాధికారికంగా సమాచారాలు చెప్పగలరు. కానీ వారు విధానాల రీత్యా ప్రజల పక్షాన నిలవడం కీలకం. ఎందుకంటే ప్రపంచీకరణ యుగంలో కార్పొరేట్ శక్తులే సర్కార్లను ఆడిస్తూ తమ ప్రయోజనాల కోసం కథనాలు నడిపిస్తున్నాయి. భారత కార్పొరేట్ సామ్రాట్ అదానీ గురించి అమెరికా మీడియాలో సాగిన వివాదం కేసులు తర్వాత కోర్టుల సాక్షిగా అంతా సర్దుకోవడం చూశాం, కనక ఇలాంటి సందర్భాలలోనూ విమర్శనాత్మకంగా వుండవలసిందే.?

### ప్రజల పక్షాన కృషి?

పర్యావరణ, ప్రజాస్వామ్య స్వేచ్ఛలు, ఎస్.సి-ఎస్.టి హక్కుల రక్షణ వంటి విషయాలలో కొంతమంది మాజీ ఉన్నతాధికారులు ప్రశంసనీయమైన భూమిక పోషించడం, పౌర సమాజంలో చొరవ చూపడం అభినందనీయం. లౌకిక ప్రజాస్వామిక భావాలకు నిబద్ధులైన మరికొందరు ప్రముఖులు విశేషంగా శ్రమించి విషయాలను వెలికితీస్తున్నారు. ప్రజాపక్ష మేధావుల పాత్రను పాలకులు జీర్ణించుకోలేకపోవడం, సోషల్ మీడియాలో రకరకాల దాడులు చేయించడం కూడా పరిపాటిగా మారింది. అదే సమయంలో రాజకీయంగా తాము మితవాదం వైపు (రైట్) వున్నామని ఎ.బి వెంకటేశ్వరరావు వంటి వారు స్పష్టంగా చెప్పడం గమనించదగింది. సామాజిక న్యాయం, దళిత హక్కుల కోసం తాము రాజకీయాల్లోకి వస్తామని మరికొందరు ప్రకటిస్తున్నారు. వారి విధానాలను, ఆచరణను చూడవలసే వుంటుంది. ఉదాహరణకు విజయసాయి రెడ్డి తాను మోడీ నాయకత్వాన్ని బలోపేతం చేస్తానని ప్రకటించారు. కాకినాడ సామూహిక ఆత్మహత్య ఘటనల్లో లవ్ జిహాద్ తీసుకొచ్చారు. ప్రపంచీకరణ గతం కన్నా ఎక్కువగా లాబీయింగ్‌ను కూడా ఒక పరిశ్రమగా తయారు చేసిన తీరు ప్రశాంత కిశోర్ వంటి మార్కెట్ వ్యూహకర్తలు ప్రత్యక్షంగా చూపించారు. ఇప్పుడు వివిధ స్థాయిల్లో అది విస్తరిస్తున్నది. వచ్చే ఎన్నికలలోగా ఇంకా అనేక వేదికలూ వ్యవస్థలూ పుట్టుకు రావచ్చు. సర్వేలూ జనాభిప్రాయాలు వాటిపై చర్చలతో ప్రభావాలూ కూడా పెరుగుతాయి. తమిళనాడులో సంచలన విజయం సాధించిన ముఖ్యమంత్రి విజయ్ సర్వేలలో కాస్త రేటింగు పెంచుకున్నారని తెలియగానే కాంగ్రెస్ భరించలేక పోయింది. సిజెపి నాయకులపై ఆరోపణలతో అప్పుడే సిజెపి (డి) అంటూ పుట్టుకొచ్చింది. ఈ నేపథ్యంలో ఏ పరిణామాన్ని, ఏ సమయంలో ఏ కోణంలో చూడాలన్న విచక్షణ చాలా ముఖ్యం. న్యాయ వ్యవస్థ కూడా చాలా సందర్భాలలో విమర్శలకు గురైనా ఇటీవలి సంచలనాలు ఊహకందనివి. ఒక పాఠ్య పుస్తకంలో న్యాయవ్యవస్థ అవినీతి గురించి ప్రస్తావించినందుకు సిజెఐ సూర్యకాంత్ తీవ్రంగా స్పందించారు. కానీ రాజస్థాన్ హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తిపై సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఆరోపణలు చేయడం, ఆయనను తప్పించడం

**తెలకపల్లి రవి**

# 'ఎల్‌నినో' సన్నద్ధత ఇలాగేనా?

యావత్ ప్రపంచాన్ని బెంబేలెత్తిస్తున్న ఎల్‌నినో రానున్న రోజుల్లో ఇప్పటి కంటే మరింత ఉధృతమవుతుందని, వచ్చే ఏడాది కూడా కొనసాగుతుందని ఐక్యరాజ్యసమితి అనుబంధ ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) తాజాగా చేసిన హెచ్చరిక ఎల్‌నినో ప్రభావాన్ని చవిచూస్తున్న మన రాష్ట్రానికి ప్రమాద ఘంటిక.







ఎల్‌నినోతో అనూహ్య, అసాధారణ వర్షాలు, వరదలు, కరువు కాటకాలు, ఉష్ణోగ్రతలు సంభవిస్తాయి. ఎల్‌నినోపై అంచనాలు ప్రారంభమయ్యాక గడచిన దశాబ్దాల్లో కంటే ప్రస్తుత ప్రభావం చాలా ఎక్కువని, ప్రభుత్వాల సన్నద్ధత, స్పందన సైతం అసాధారణంగా ఉండాలని సూచించింది. నిజానికి సీజన్ ప్రారంభానికి ఎంతో ముందుగానే ఎల్‌నినోపై డబ్ల్యుఎంఒ హెచ్చరికలు చేయగా, భౌగోళికంగా తుపాన్లు, వరదలు, కరువులకు ఆస్కారం ఉన్న ఆంధ్రప్రదేశ్ సన్నద్ధత, స్పందన సరిగ్గా లేదని ముందస్తు ఏర్పాట్లను, ప్రణాళికలను చూస్తే అర్థమవుతుంది. వ్యవసాయ రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఖరీఫ్ ప్రాణాధారమన్న విషయం ఏలికలకు తెలియనిది కాదు. తాగునీటి సమస్యలు తలెత్తుతాయనీ ఎరుకే. ఎల్‌నినో ప్రభావం సీజన్ మొదట్లో అంతగా ఉండదని సన్నద్ధతపై పెట్టాల్సిన స్థాయిలో శ్రద్ధ వహించలేదు. ఆగస్టు ముగిసి సెప్టెంబర్‌లో పడ్డాక ఇప్పుడు తీరిగ్గా ఎల్‌నినో పరిస్థితులపై వివరిస్తూ, ఆర్థిక సహాయాన్ని అభ్యర్థిస్తూ కేంద్రానికి లేఖ రాయాలని రాష్ట్ర మంత్రి మండలి తీర్మానించడం విడ్డూరం. ఇదే ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అతి పెద్ద మేలుగా ప్రచారం చేసుకోవడం అభ్యంతరకరం. నైరుతి రుతుపవనాల చలనంలో బలహీనత, ఎల్‌నినో కట్టకట్టుకొని రాష్ట్రంపై దాడి చేయడంతో ఖరీఫ్ సేద్యం తీవ్ర ఒత్తిడికి గురవుతోంది. ఏ నెలలోనూ ఏ జిల్లాలోనూ ఇప్పటి వరకు సాధారణ వర్షం పడలేదు. జూన్ నుంచి ఆగస్టు చివరాఖరు వరకు వర్షపు లోటు 54 శాతం. అన్నమయ్య, ప్రకాశం, చిత్తూరు, మార్కాపురం, శ్రీసత్యసాయి, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వర్షపు లోటు 60 నుంచి 76 శాతం. అతి త్వరలోనే మరికొన్ని జిల్లాలూ ఈ స్థితికి చేరుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ఎ.పి.లో 688 మండలాలకుగాను 630 మండలాలు తీవ్ర వర్షాభావంతో కొట్టుమిట్టాడుతున్నాయి. సేద్యం సాధారణ విస్తీర్ణంలో 66 శాతమే జరిగింది. సీజన్ ముగియడానికి ఇంకా పాతిక రోజులే ఉంది. ఈ పూర్వరంగంలో 20-25 లక్షల ఎకరాల్లో సాగు లేక బీడు పడటం ఖాయంగా కనిపిస్తోంది. సాగైన లక్షల ఎకరాల్లో పంటలకు సైతం నీటి గండం పొంచి ఉంది. చాలా చోట్ల పంటలు ఎండుతున్నాయి. భారీగా దిగుబడులు తగ్గనున్నాయి. రాష్ట్రానికి అన్నపూర్ణగా పేరు తెచ్చిన కృష్ణా డెల్టాలో వరి సాగుపై ప్రభుత్వం సృష్టించిన గందరగోళం రైతులను దిక్కుతోచని స్థితిలోకి నెట్టింది. తాగునీటి అవసరాల కోసమే ప్రాజెక్టుల్లోని నీటి నిల్వలను వినియోగించాలని ప్రభుత్వం ప్రతిపాదించినా శ్రీశైలంలో తెలంగాణ, ఎ.పి. పోటీపడి విద్యుదుత్పత్తి చేసి దిగువకు నీళ్లొదిలాయి. రాయలసీమకు తాగునీటి అవసరాలకు నీరు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం చుక్కనీరు విడుదల చేయలేదు. వెలిగొండ తొలిదశ ప్రారంభోత్సవానికి కొన్ని నీటిని ఇచ్చారంతే. రాష్ట్రంలో 20 వేల హేబిటేషన్లుండగా 15 వేల హేబిటేషన్లలో తాగునీటి ఇబ్బంది రావొచ్చని కేబినెట్‌లో అంచనా వేశారు. ఇప్పటికే కొన్ని మున్సిపాలిటీలు, నగరాలు, గ్రామాల్లో రెండు మూడు రోజులకోమారు తాగునీరిస్తున్న దశలో భవిష్యత్తు సహజంగానే భయపెడుతుంది. కరువొచ్చినప్పుడు బావులు తవ్వడం మొదలుపెట్టినట్టు కాకుండా ముందుగానే ప్రజలకు రక్షిత తాగునీటిని అందించే ఏర్పాట్లు చేయడం ప్రభుత్వ కనీస బాధ్యత. కరువొచ్చిందంటే పశువులకు తాగునీరు, మేత, విద్యుత్ సమస్య ముందుకొస్తుంది. తగిన ముందస్తు చర్యలు చేపట్టాలి. కూలీలకు పనులుండవు. ప్రత్యేకంగా ఉపాధిహామీ పనులు చేపట్టి ఆదుకోవాలి. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి. బీమా అయోమయం ఉండనే ఉంది. వీలున్న ప్రతి అంగుళం భూమిలోనూ ఏదో ఒక పంట పండించేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేయాలి.

# ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

### అధికారులను ఆదేశించిన కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



మేడ్చల్--మల్కాజిగిరి కలెక్టరేట్ సెప్టెంబర్ 7 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా, నిబంధనల ప్రకారం పరిశీలించి వెంటనే పరిష్కరించాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 105 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ, సంబంధిత అధికారులు





సమన్వయంతో పనిచేసి వేగంగా పరిష్కారం చూపాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి అర్జీపై తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ మాలతి, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై తాతా మధు వ్యాఖ్యలకు ఖండన



కారేపల్లి, సెప్టెంబర్ 7 నిర్భయవార్త రిపోర్టర్ తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ నేత తాతా మధు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు, అంబేద్కర్ సంఘ రాష్ట్ర నాయకులు ఆదేర్ల రాములు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వకుండా అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు పేర్కొన్నారు.స్పీకర్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని, రాజకీయ విభేదాలను వ్యక్తిగత దూషణలకు తీసుకెళ్లకుండా హుందాగా వ్యవహరించాలని సూచించారు. శాసనసభ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందన్నారు.తాతా మధు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా రాజకీయ నాయకులు సంయమనం పాటించాలని కోరారు.

# ఇంటిని తలపిస్తున్న సీతారాం నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాల...

### మండల విద్యాశాఖ అధికారి భద్రాచలం




భద్రాచలం సెప్టెంబర్ 7 నిర్భయ వార్త ప్రతినిధి. సీతారామ నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదులు,ప్రాంగణం, మరుగు దొడ్ల నిర్వహణ ఒక్కసారి చూశారంటే పరిశుభ్రమైన ఇంటి వాతావరణాన్ని తలపిస్తుందని మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు అన్నారు. పాఠశాలల సందర్శనలో భాగంగా సోమవారం నాడు ఆకస్మికంగా మండల విద్యాశాఖ అధికారి సందర్శించి విద్యార్థుల ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల పిల్లలకు స్థానిక దాత డి. సుబ్బరాజు వితరణ చేసిన ప్లేట్లు, గ్లాసులు,గిన్నెలు వితరణ కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని విద్యార్థులకు దాతలు ఇచ్చిన వస్తువులను అందించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మండల విద్యాశాఖ బెక్కంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలను సమాజం గుర్తించాలని విద్యార్థుల అన్ని రకాల అవసరాలను ప్రభుత్వపరంగా అందించటానికి మేము సిద్ధంగా ఉన్నామని అదేవిధంగా దానికి అనుసంధానంగా మీ సహాయ సహకారాలను మా పాఠశాలకు అందించి గుణాత్మకమైన విద్యను పాఠశాలలో సాధించే విధంగా అందరూ సహకరించాలని గ్రామస్తులకు బెక్కంటి పిలుపునిచ్చారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో ప్రాథమిక స్థాయి నుండి భావి భారత పౌరుల ఉజ్వల భవిష్యత్తుకు పునాదిగా ఉండాల్సిన తరగతి గదిలో కనీస అభ్యసనా సామర్థ్యాలు సాధించటానికి రాష్ట్ర ఉన్నత అధికారులు అంకిత భావంతో పనిచేస్తున్నారని దానికి ఉపాధ్యాయులు అందరూ సమిష్టి సంఘీభావంతో ముందుకు వెళుతున్నామని దానికి ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందిస్తే మంచి సమాజ రూపకల్పనకు అవకాశం ఉంటుందని ఎంఈఓ గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. రామకృష్ణ, కే కరుణ కుమార్ బహుమతి వితరణ దాత దీ. సుబ్బరాజు,బందు. వెంకటేశ్వరరావు అధ్యక్షులు తెలంగాణ అన్ని పెన్షనర్స్ మరియు రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ (టాప్రా), ఖూాం ప్రసాద్, జి. భూషణరావు అధ్యక్షులు రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం , దామోదర్ రావు, పాఠశాల స్వచ్ఛ మిత్ర సేవకుడు జి.దిలీప్ కుమార్ మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు పి మౌనిక పాల్గొన్నారు.

# విమర్శలకు 'రూ.280 కోట్లు' సమాధానం!

### ఆసుపాకలో హోరెత్తిన కాంగ్రెస్ '1000 రోజుల పాలన' సంబరాలు

### అభివృద్ధి చూసి విమర్శలు చేయండి: వైస్ చైర్‌పర్సన్ జూపల్లి రమేష్ బాబు

### అశ్వారావుపేట ప్రగతికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మార్క్ పాలన

### తరలివచ్చిన జనం.. పండుగ వాతావరణంలో వేడుకలు





అశ్వారావుపేట, సెప్టెంబర్ 7 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) "అభివృద్ధి కళ్లముందే కనిపిస్తుంటే.. రాజకీయ ఉనికి కోసం విమర్శలు చేయడం ప్రజలను మోసం చేయడమే" అని అశ్వారావుపేట మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్, యువ నాయకుడు జూపల్లి రమేష్ బాబు ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆసుపాక గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో 'వెయ్యి రోజుల పాలన--ప్రగతి పండుగ'ను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు ప్రజలు, మహిళలు, కాంగ్రెస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆసుపాక గ్రామం ప్రాంగణం జనసందోహంగా మారింది.

**విమర్శలు చేసేవారికి కళ్లముందే మార్పు!**

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జూపల్లి రమేష్ బాబు మాట్లాడారు. నిధులు తీసుకురావడం చేతగాక, ప్రజాక్షేత్రంలో పనులు చేతకాని కొందరు నాయకులు చౌకబారు విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. మాటలతో కాదు.. రూ.280 కోట్లకు పైగా సంక్షేమ, అభివృద్ధి పనులతోనే తాము విమర్శకులకు జవాబు ఇస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దార్శనికతతో నియోజకవర్గంలో రికార్డు స్థాయి నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు.

రహదారుల కష్టాలకు స్వస్తి: నియోజకవర్గంలో రహదారుల విస్తరణకు రూ.40 కోట్లు కేటాయించి పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. పేరాయిగూడెంలో రూ.4 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయింది.

ఆరోగ్య రంగంలో విప్లవం: రూ.36 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రి రూపురేఖలు మారుతున్నాయని, 10 మంది నిపుణులైన వైద్యులను అందుబాటులోకి తెచ్చి ఉచిత వైద్యాన్ని ప్రజల ముంగిట్లోకి తెచ్చామని స్పష్టం చేశారు. విమర్శలు చేసేవారు ఒక్కసారి ఆసుపత్రి **పనులను పరిశీలించాలని సవాల్ విసిరారు.**

భవిష్యత్తుకు రూ. 200 కోట్లు: విద్యార్థుల చదువు కోసం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ రూ.200 కోట్ల వ్యయంతో సమీకృత, గురుకుల పాఠశాల భవనాలను నిర్మిస్తోందన్నారు.

పట్టణ అందాలు: పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనులతో రహదారులు వెలుగులీనుతున్నాయని వివరించారు.

**ప్రజా తీర్పుకు గౌరవం.. పాలనకు లభిస్తున్న మద్దతు:**

వెయ్యి రోజుల్లో ప్రగతి పథంలో పయనిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల మద్దతు లభిస్తోందని, సంక్షేమ పథకాలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం సరికొత్త అధ్యాయం సృష్టిస్తోందని రమేష్ బాబు అన్నారు.

ఈ వేడుకల్లో ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రం, సర్పంచులు,

మాజీ సర్పంచులు, గ్రామ పెద్దలు, నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ పాలన పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# గిరిజన దర్బార్ లో గిరిజనులు సమర్పించిన వినతులకు సత్వర పరిష్కారం చూపాలి : ఐటీడీఏ పీవో బి రాహుల్

### గిరిజనుల ప్రతి విన్నపాన్ని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి



భద్రాచలం సెప్టెంబర్ 7 నిర్భయ వార్త ప్రతినిధి. వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుండి వచ్చే గిరిజనులు గిరిజన దర్బార్లో సమర్పించే వినతులకు సత్వర పరిష్కారం చూపాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ ఐటీడీఏ యూనిట్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటిడిఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో వివిధ ఆదివాసి ఏజెన్సీ గిరిజన గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల వినతులు, సమస్యల ఫిర్యాదులను ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఎస్ డి సి ట్రైబల్ వెల్ఫేర్ ఆనందకుమార్, గురుకులం ఆర్ సి ఓ అరుణకుమారి, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఎడిఎంహెచ్వో సైదులు తో కలసి స్వీకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పెన్షన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను గిరిజనులు పి ఓ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ.. ఆదివాసి గిరిజనుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు గిరిజన దర్బార్ కార్యక్రమం ప్రభుత్వం కల్పించిన ముఖ్యమైన వేదిక అని అన్నారు. గిరిజనుల నుంచి స్వీకరించిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖల యూనిట్ అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని ఐటీడీఏ పీవో తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖలకు వెంటనే పంపించాలని సూచించారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను



ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో గిరిజన ప్రజల సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని పిఓ సూచించారు. గిరిజన దర్బార్ లో స్వీకరించిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, పరిష్కార స్థితిని పరిశీలించాలని యూనిట్ అధికారులను ఆదేశించారు. గిరిజనుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా స్పందించి, ప్రభుత్వ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందించాలని తెలిపారు. ప్రజలు తమ దరఖాస్తులతో పాటు సమస్యకు సంబంధించిన అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని పిఓ తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించేందుకు ప్రతి యూనిట్ అధికారి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**గిరిజన దర్బార్ లో వచ్చిన దరఖాస్తులు**

పోడు భూముల సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, గిరిజన గ్రామాలలో రోడ్డు సౌకర్యం కల్పించుట కొరకు, స్వయం ఉపాధి ద్వారా జీవనాధారం పెంపొందించుకోవడానికి ఆర్థిక సహాయం ఇప్పించుట కొరకు, ఎల్ టి ఆర్ భూముల సమస్యలు పరిష్కరించుట కొరకు, ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో చేరడానికి శిక్షణలు అందించుట కొరకు, దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం ఇప్పించుట కొరకు, పంట పొలాలకు నీరు అందించడానికి కరెంటు, బోరు, మోటారు ఇప్పించుట కొరకు, రైతుబంధు రుణాలు ఇతర ఆర్థిక ప్రయోజనాలు కల్పించుట కొరకు గిరిజనులు అర్జీలు పెట్టుకున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఏపీవో పవర్ వేణు, ఏవో సున్నం రాంబాబు, పి వి టి జి అధికారి గన్యా, ఎల్ టి ఆర్ డి టి మణిధర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనసూయ, మిషన్ భగీరథ వర్క్ ఇన్స్పెక్టర్ వీరారెడ్డి, వివిధ శాఖల సిబ్బంది స్వాతి, కార్తీక్, వెంకటేశ్వర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# 1/70 చట్టం అమలుకై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

## జి ఎస్ పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర డిమాండ్



ములుగు సెప్టెంబర్ 7 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని జి ఎస్ పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర డిమాండ్ చేశారు. సోమవారం వెంకటాపురం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జి ఎస్ పి ములుగు జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పూనెం సాయి దొర మాట్లాడారు.ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 1/70 చట్టం అమలుకు ఆదివాసీ ఎమ్మెల్యేలందరూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ చట్టాలపై గిరిజనేతరులు దాడులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గిరిజనేతరులు 1/70 చట్టానికి విరుద్ధంగా ఏజెన్సీ ప్రాంతాల్లోకి వలస వచ్చి ఆదివాసీల భూములు, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు పాల్పడుతున్నారని పూనెం సాయి దొర ఆరోపించారు. ఆదివాసీ చట్టాలు, జీవోల పరిరక్షణ కోసం ఆదివాసీలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఏజెన్సీ ప్రాంతాల నుంచి బూర్జువా రాజకీయ పార్టీలను బహిష్కరించినప్పుడే ఆదివాసీ చట్టాలు, జీవోలు సమర్థవంతంగా అమలవుతాయని అన్నారు. లేదంటే రాజకీయ పార్టీలు ఆదివాసీ చట్టాలను నిర్వీర్యం చేసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 89 ఏళు గడిచినా ఆదివాసీల కోసం రూపొందించిన చట్టాలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం దురదృష్టకరమన్నారు. ఆదివాసీ చట్టాల వల్ల, రిజర్వేషన్ల వల్లే ఆదివాసీ ఎమ్మెల్యేలు ఎన్నికై అసెంబ్లీకి వెళ్తున్నారని తెలిపారు. అయితే ఆదివాసీ రిజర్వేషన్లు రద్దు చేయాలని గిరిజనేతరులు మాట్లాడుతున్నప్పటికీ ఆదివాసీ ఎమ్మెల్యేలు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టంతో పాటు పీసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఇందుకోసం అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆయన మరోసారి డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో పద్దం సుధాకర్, కారం రాజబాబు, సురేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించాలని ప్రజావాణిలో వినతి




కారేపల్లి సెప్టెంబర్ 7 నిర్భయవార్త రిపోర్టర్. అర్ధాంతరంగా ఆపిన డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్లు ఇవ్వాలని, కారేపల్లి లోని బస్ బస్ షెల్టర్ నిర్మించాలని ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సింగరేణి మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు విద్యార్థులకు ఎంతో అవసరమైన ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు చేసుకోవడానికి ముఖ్యమైన డేటా బర్త్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం దుర్మార్గమని జీవితాలతో ఆడుకోవడమే నని విమర్శించారు. ప్రస్తుతం డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్ కావాలంటే సివిల్ కోర్టుకు వెళ్లాలని ప్రభుత్వాన్నిబంధనలు చెబుతున్నాయని ఇది ఎంతమందికి సాధ్యమని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు ప్రజలకు అందుబాటులో ఉండే కార్యాలయాలు ఉండగా సివిల్ కోర్టుకు అప్పజెప్పడం ఏమిటని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఆగస్టు 6 నుంచి ఆపు చేసిన డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్ లను వెంటనే ఇవ్వడం ప్రారంభించాలని వినయ్ కుమార్ పేర్కొన్నారు. కారేపల్లి మండల కేంద్ర గ్రామం కావడం వలన ప్రజలు నిత్యం కారేపల్లి లో వివిధ రకాల పనుల నిమిత్తం వేలాదిగా ప్రయాణిస్తుంటారని అటువంటి మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్ మరియు సినిమా హాల్ సెంటర్ల లో కనీసం జనం నిలబడడానికి బస్ షెల్టర్ లేని దుస్థితి నెలకొన్నదని వీటిని నిర్మాణం వెంటనే చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే కృషి చేయాలని లేని పక్షంలో ప్రజలను కూడగట్టి ప్రజా పోరాటాల నిర్మిస్తామని ఆధర్ల వినయ్ కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు దిలీప్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానంపై చైతన్యం పెంపొందించాలి

## జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ఐడీఓసీలో నేత్ర పరీక్షల శిబిరం









మేడ్చల్ మల్కాజిగిరి సెప్టెంబర్ 07 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడీఓసీ కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో నేత్ర పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని అదనపు కలెక్టర్ (అర్బన్ లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్ ప్రారంభించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.ప్రత్యేక ఆహ్వానితులుగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ఏ) డా. బరీరా ఫరీద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (యూఎల్‌సీ) సి. మోక్షిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. కె. ఆనంద్ మాట్లాడుతూ.. నేత్ర ఆరోగ్య పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య సేవలు అందించడం, నేత్రదానంపై చైతన్యం కల్పించడం శిబిరం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా మరో వ్యక్తి జీవితంలో వెలుగులు నింపవచ్చని, ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శిబిరంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో పాటు జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సిబ్బంది కంటి ఆరోగ్యం, కంటి సంరక్షణపై అవగాహన కల్పించారు. డా. సి. చంద్రకళ, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందితో నేత్రదాన ప్రతిజ్ఞ చేయించారు. మరణానంతరం నేత్రాలను దానం చేయడం ద్వారా అంధులకు చూపును అందించవచ్చని, నేత్రదానం ద్వారా సమాజానికి విలువైన సేవ చేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాంబశివరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. కౌశిక్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన

## “మట్టి గణపతిని ప్రతిష్టిద్దాం--పర్యావరణాన్ని పరిరక్షిద్దాం”




మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టరేట్ సెప్టెంబర్ 07 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా ఈ నెల 14న పర్యావరణహిత మట్టి విగ్రహాలను వినియోగించాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరీ, ఐఏఎస్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం--మేడ్చల్ పర్యావరణ ఇంజనీర్, నోడల్ అధికారి బి. రాజేందర్ తదితర అధికారులతో కలిసి అవగాహన గోడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాల స్టాల్‌ను ప్రారంభించి కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో పాటు ప్రజలకు విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని అధికారులు సూచించారు. “మట్టి గణపతిని ప్రతిష్టిద్దాం--పర్యావరణాన్ని పరిరక్షిద్దాం” అనే సందేశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.



**నోవెలిక్స్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్**
**(గతంలో TRIMURTHI LIMITED పేరుతో ప్రసిద్ధి)**
**CIN: L67120TG1994PLC018956**
**రిజిస్టర్డ్ కార్యాలయం:** H No: 3-6-237/610, ఫ్లాట్ నం. 610, 6వ అంతస్తు, లింగాపూర్ LA బిల్డర్స్, అమృత ఎస్టేట్స్ పేరుతో కూడా ప్రసిద్ధి, హిమాయత్ నగర్, హైదరాబాద్, తెలంగాణ – 500029
**ఫోన్ నం.:** +91 8977631044 **ఈ-మెయిల్:** novelixpharmaceuticals@gmail.com
**వెబ్‌సైట్:** www.novelixpharma.com **స్క్రిప్ కోడ్:** 536565

**32వ వార్షిక సాధారణ సమావేశం, పుస్తకాలు మూసివేత మరియు రిమోట్ ఈ-వోటింగ్‌కు సంబంధించిన నోటీసు**

ఇందుమూలంగా తెలియజేయడమైనది ఏమనగా, కంపెనీ సభ్యుల 32వ వార్షిక సాధారణ సమావేశం (AGM) బుధవారం, 30 సెప్టెంబర్ 2026 తేదీన మధ్యాహ్నం 03.00 గంటలకు (IST) వీడియో కాన్ఫరెన్సింగ్ (VC) / ఇతర ఆడియో-విజువల్ మార్గాలు (OAVM) ద్వారా నిర్వహించబడుతుంది. AGM నోటీసులో పేర్కొన్న వ్యాపార అంశాలను ఈ సమావేశంలో నిర్వహించబడతాయి.

మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ ("MCA") జారీ చేసిన General Circular No. 09/2024 dated 19th September 2024 మరియు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ("SEBI") జారీ చేసిన Circular No. SEBI/HO/CFD/CFD-PoD-2/P/CIR/2024/133 dated 3rd October 2024, అలాగే ఈ విషయానికి సంబంధించి MCA మరియు SEBI జారీ చేసిన ఇతర వర్తించే సర్క్యులర్లకు అనుగుణంగా (ఇవన్నీ కలిపి "Circulars"గా పిలవబడతాయి), 2025-26 వార్షిక నివేదిక, అందులో AGM నోటీసుతో సహా, కంపెనీ లేదా రిజిస్ట్రార్ మరియు ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ మరియు డిపాజిటరీల వద్ద తమ ఈ-మెయిల్ చిరునామాలను నమోదు చేసుకున్న సభ్యులకు M/s. Venture Capital and Corporate Investments Pvt. Limited ద్వారా 07 సెప్టెంబర్ 2026న ఎలక్ట్రానిక్ విధానంలో పంపబడుతుంది.

అదనంగా, SEBI Listing Regulations లోని Regulation 36(1)(b) ప్రకారం, తమ ఈ-మెయిల్ IDలను నమోదు చేసుకోని సభ్యులందరికీ 32వ AGM నోటీసు మరియు 2025-26 వార్షిక నివేదికను యాక్సెస్ చేయడానికి వెబ్-లింక్ కలిగిన లేఖ పంపబడుతుంది.

2025-26 వార్షిక నివేదికలో AGM నోటీసుతో పాటు, సమావేశంలో నిర్వహించబోయే సాధారణ వ్యాపార మరియు ప్రత్యేక వ్యాపార అంశాలు మరియు 32వ AGM యొక్క వివరణాత్మక ప్రకటన (Explanatory Statement) ఉన్నాయి. ఈ వార్షిక నివేదిక కంపెనీ వెబ్‌సైట్ www.novelixpharma.com మరియు స్టాక్ ఎక్స్చేంజ్ అయిన www.bseindia.com వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటుంది.

VC/OAVM ద్వారా AGMలో పాల్గొనే విధానం మరియు సూచనల కోసం సభ్యులు AGM నోటీసును పరిశీలించవలసిందిగా కోరుతున్నాము.

**పుస్తకాలు మూసివేత**

షేర్ ట్రాన్స్‌ఫర్ బుక్ గురువారం, 24 సెప్టెంబర్ 2026 నుండి బుధవారం, 30 సెప్టెంబర్ 2026 వరకు (రెండు రోజులు కలుపుకొని) మూసివేయబడుతుంది.

**రిమోట్ ఈ-వోటింగ్**

కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 108, Companies (Management and Administration) Rules, 2014లోని Rule 20, Listing Regulations లోని Regulation 44 మరియు Institute of Company Secretaries of India జారీ చేసిన Ordinary Meetings కు సంబంధించిన Secretarial Standards ప్రకారం, కంపెనీ Central Depository Services (India) Limited (CDSL) వద్ద నమోదు చేసుకుని, AGMలో ప్రతిపాదించబడిన తీర్మానాలపై సభ్యులు తమ ఓటు హక్కును ఎలక్ట్రానిక్ విధానంలో వినియోగించుకునేందుకు ఈ-వోటింగ్ సౌకర్యాన్ని అందిస్తోంది.

**ఈ సందర్భంలో సభ్యులకు క్రింది సమాచారం తెలియజేయబడుతుంది:**

a) రిమోట్ ఈ-వోటింగ్ కాలం ఆదివారం, 27 సెప్టెంబర్ 2026 ఉదయం 09:00 గంటలకు ప్రారంభమై, మంగళవారం, 29 సెప్టెంబర్ 2026 సాయంత్రం 05:00 గంటలకు ముగుస్తుంది. మంగళవారం, 29 సెప్టెంబర్ 2026 సాయంత్రం 05:00 గంటల తర్వాత రిమోట్ ఈ-వోటింగ్ అనుమతించబడదు. అనంతరం CDSL ద్వారా ఈ సౌకర్యం నిలిపివేయబడుతుంది.

b) డిపాజిటరీలు నిర్వహించే Register of Members లేదా Register of Beneficial Ownersలో బుధవారం, 23 సెప్టెంబర్ 2026 నాటి cut-off date నాటికి పేర్లు నమోదై ఉన్న వ్యక్తులు మాత్రమే AGMలో రిమోట్‌గా ఓటు వేయడానికి మరియు ఈ-వోటింగ్ సౌకర్యాన్ని వినియోగించుకోవడానికి అర్హులు.

రిమోట్ ఈ-వోటింగ్ మరియు AGMలో ఈ-వోటింగ్‌కు సంబంధించిన పూర్తి విధానం మరియు సూచనలు AGM నోటీసులో ఇవ్వబడ్డాయి.

c) AGM నోటీసు పంపిన తర్వాత కంపెనీ షేర్లను కొనుగోలు చేసి, కంపెనీ సభ్యుడిగా మారి, 23 సెప్టెంబర్ 2026 cut-off date నాటికి షేర్లను కలిగి ఉన్న వ్యక్తి helpdesk.evoting@cdslindia.com కు అభ్యర్థన పంపడం ద్వారా login ID మరియు password పొందవచ్చు.

అయితే, ఎవరైనా వ్యక్తి ఇప్పటికే CDSL రిమోట్ ఈ-వోటింగ్ కోసం నమోదు చేసుకుని ఉంటే, తన ప్రస్తుత User ID మరియు Password ఉపయోగించి ఓటు వేయవచ్చు.

d) రిమోట్ ఈ-వోటింగ్ ద్వారా ఓటు వేయని మరియు VC/OAVM ద్వారా AGMకు హాజరయ్యే సభ్యులు AGM సమయంలో ఈ-వోటింగ్ ద్వారా ఓటు వేయడానికి అర్హులు.

రిమోట్ ఈ-వోటింగ్ ద్వారా AGMకు ముందు ఓట్లు వేసిన సభ్యులు కూడా VC/OAVM ద్వారా AGMకు హాజరు కావచ్చు. అయితే, వారు మళ్లీ ఓటు వేయడానికి అర్హులు కారు.

e) ఈ-వోటింగ్ సౌకర్యానికి సంబంధించిన ఏవైనా సందేహాల కోసం **www.evotingindia.com**లో అందుబాటులో ఉన్న Frequently Asked Questions ("FAQs") లేదా Help విభాగంలో ఉన్న Remote E-Voting User Manualను పరిశీలించవచ్చు. లేదా: Mr. Rakesh Dalvi, Senior Manager ఫోన్: 1800 22 55 33 CDSL A Wing, 25th Floor, Marathon Futurex, Mafatlal Mill Compounds, NM Joshi Marg, Lower Parel (East), Mumbai – 400013 ఈ-మెయిల్: helpdesk.evoting@cdslindia.com స్పీకర్ రిజిస్ట్రేషన్ కోసం అవకాశం

AGM సమయంలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి లేదా ప్రశ్నలు అడగడానికి ఆసక్తి ఉన్న సభ్యులు 23 సెప్టెంబర్ 2026 ఉదయం 09:00 గంటల నుండి 28 సెప్టెంబర్ 2026 సాయంత్రం 05:00 గంటల వరకు తమ రిజిస్టర్డ్ ఈ-మెయిల్ చిరునామా నుండి novelixpharmaceuticals@gmail.com కు అభ్యర్థన పంపి స్పీకర్‌గా తమ పేరును నమోదు చేసుకోవచ్చు. అభ్యర్థనలో క్రింది వివరాలను పేర్కొనాలి: సభ్యుని పేరు DP ID మరియు Client ID / Folio Number PAN మొబైల్ నంబర్ స్పీకర్‌గా నమోదు చేసుకున్న సభ్యులకు మాత్రమే AGM సమయంలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి లేదా ప్రశ్నలు అడగడానికి అవకాశం ఇవ్వబడుతుంది.

AGMకు అందుబాటులో ఉన్న సమయాన్ని బట్టి స్పీకర్ల సంఖ్యను పరిమితం చేసే హక్కు కంపెనీకి ఉంటుంది.

ఏవైనా ప్రశ్నలు లేదా ఫిర్యాదుల కోసం novelixpharmaceuticals@gmail.com కు ఈ-మెయిల్ చేయవచ్చు.

**నోవెలిక్స్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ తరఫున**
**Sd/-**
**వెంకటేశ్వర్లు పుల్లూరు**
**(పూర్తికాల డైరెక్టర్)**
**DIN: 02076871**

**తేదీ: 07 సెప్టెంబర్ 2026**
**స్థలం: హైదరాబాద్**

# తల్లిదండ్రులు లేని ఆదివాసీ విద్యార్థికి అండగా ఐటీడీఏ భద్రాచలం

## ఎం బి బి ఎస్ చదువుకు ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుండి ఆర్థిక సహాయం అందజేత




భద్రాచలం సెప్టెంబర్ 7 నిర్భయ వార్త ప్రతినిధి. ములకలపల్లి మండలం, సీతాయిగూడెం గ్రామానికి చెందిన కోయ ఆదివాసీ విద్యార్థి నక్క సంతోష్ తల్లిదండ్రులు లేకపోయినా, తన కష్టంతో చదువుకుని చీజుజులో 424 మార్కులు సాధించాడని అలాగే కోదాడ మండలం కొత్తగూడెం తండాకి చెందిన భూక్యవాసిని ఎంబిబిఎస్ లో సీట్లు సాధించారని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. సోమవారం నాడు తన ఛాంబర్ లో ఎంబిబిఎస్ లో సీట్లు సాధించిన సాధించిన నక్క సంతోష్ కు 60 వేలు భూక్యవాసిని కు 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేకపోయినా పట్టుదలతో చదివి నీట్ లో 424 మార్కులు నక్క సంతోష్, 474 మార్కులు సాధించిన భూక్యవాసిని ఎంబిబిఎస్ లో సీటు సంపాదించిందని అన్నారు నక్క సంతోష్ ఆర్థిక స్తోమత లేక ఎంబిబిఎస్ కోర్సు చేయలేకపోతున్నట్లు కొన్ని పత్రిక కథనాల ద్వారా నా దృష్టికి రావడంతో వెంటనే స్పందించి ఆదివాసి సంఘాల ఐక్యవేదిక ద్వారా ఆ విద్యార్థి వినిపించిన విషయాలు తెలుసుకొని వెంటనే ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుండి 60 వేల రూపాయల చెక్కును అలాగే కడు పేదరికముతో చదువులో వెనకడుగు వేయకుండా పట్టుదలతో చదివి ఎంబీబీఎస్ సీటు సంపాదించిన భూక్యవాసినికి ఎంబిబిఎస్ కోర్సు నిమిత్తం 50 వేల రూపాయల చెక్కును అందించడం జరిగిందని ఆయన అన్నారు. ఒక గిరిజన తెగకు చెందిన విద్యార్థిని విద్యార్థి డాక్టర్ కావాలనే కుతూహలముతో పట్టుదలగా చదివి ఎంబిబిఎస్ లో సీటు సంపాదించడంతో వారి చదువుకు ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుండి ఆర్థిక సహాయం అందించడం జరిగిందని ఆయన అన్నారు. నక్క సంతోష్ ఎంబిబిఎస్ చదువుకు ఆర్థిక సహాయం అందించాలని ఆదివాసి సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు పిఓ దృష్టికి తీసుకొని వెళ్లగా ఐటీడీఏ పీవో వెంటనే స్పందించి గంట వ్యవధిలోనే 60 వేల రూపాయల చెక్కును అందించి పెద గిరిజన విద్యార్థి డాక్టర్ కోర్స్ కు తోడ్పాటు అందించినందుకు ప్రత్యేకంగా ఆదివాసీ సంఘాలు, నాయకులు పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం కోయ కుల సంఘం పటేల్ తెల్లం రమణయ్య, ఆదివాసీ నాయకులు కుంజా ధర్మా, కుంజా సంతోష్, పూనెం వీరభద్రం, గుండు శరత్, పాయం రవివర్మ, ముర్ల రమేష్, పూనెం నాగేశ్వరరావు, కొండ్రు వీరస్వామి, కొండ్రు సుధారాణి, కణితి రాధ, మిడియం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

## బీఆర్ఎస్ వెంకటాపురం మండల కమిటీ డిమాండ్



ములుగు సెప్టెంబర్ 7 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీఆర్ఎస్ వెంకటాపురం మండల కమిటీ డిమాండ్ చేశారు ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు సోమవారం వెంకటాపురం మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యాలయంలోని తహసీల్దార్ (ఎంఆర్ఓ) కార్యాలయానికి చేరుకుని పలు అంశాలపై అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గంప రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినప్పటికీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఇప్పటివరకు ఎన్ని అమలు చేశారో స్పష్టంగా తెలియజేస్తూ వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు షోలం హోంపతి, పూజారి ఆదిలక్ష్మి, వీఆర్కేపురం సర్పంచ్ రమ్య, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు మంచర్ల నాగేశ్వరరావు, బట్ట నాగేందర్, మహిళా నాయకురాళ్లు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# తాత మధు వ్యాఖ్యలకు కాంగ్రెస్ నిరసన

## ఎస్సీ, ఎస్టి కేసు నమోదు చేయాలని ఫిర్యాదు






కారేపల్లి, సెప్టెంబర్ 7: నిర్భయవార్త రిపోర్టర్ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ నేత తాత మధు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ నందు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కారేపల్లి పిఎస్ లో ఎస్సీ, ఎస్టి కేసు నమోదు చేయాలని ఎస్సై కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు ప్రజాస్వామ్యబద్ధంగా కొనసాగుతున్న అసెంబ్లీ వ్యవస్థలో స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందని వారు పేర్కొన్నారు. తాత మధు చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తులపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని, రాజకీయ విమర్శలు విధానాలకే పరిమితం కావాలని వారు సూచించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని కాపాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

## ... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

### ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం, సెప్టెంబర్-07 నిర్భయంవార్త రిపోర్టర్. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లో లేకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. మధిర మండలం నిధానపురం గ్రామానికి చెందిన ఏ. నాగిరెడ్డి తమ పిల్లలకు షుగర్, కిడ్నీ వ్యాధి సమస్యలు ఉన్నాయని, దీనికి అవసరమైన మందులు సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం, కూసుమంచి మండలానికి చెందిన రైతులు తమకు ఆన్ లైన్ విధానం రద్దు చేసి ఎరువులు సరఫరా చేయాలని, భక్త రామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులు నింపాలని, మార్క్ ఫెడ్ ద్వారా పెసర పంట కొనుగోలు నిమిత్తం కోనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వ్యవసాయ శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ ఆసుపత్రిలో పేద రోగుల ఇబ్బందులు పరిష్కరించాలి

## ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా నాయకులు డప్పు మల్లికార్జున్ మాదిగ



సికింద్రాబాద్ సెప్టెంబర్ 07 నిర్భయవార్త సిటీ బ్యూరో ప్రతినిధి: సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో పేద రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా నాయకులు డప్పు మల్లికార్జున్ మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. ఏసీఎల్ ఆపరేషన్ కోసం నాలుగు నెలలుగా ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్న పేద రోగులకు అవసరమైన ఇంప్లాంట్లు, వైద్య పరికరాలు అందుబాటులో లేవని సిబ్బంది చెబుతున్నారని తెలిపారు. గర్భిణీలు, అత్యవసర చికిత్స అవసరమైన రోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వీల్‌చైర్లు, స్ట్రెచర్లు సకాలంలో అందుబాటులో లేకపోవడంతో రోగుల కుటుంబ సభ్యులే వాటిని తోసుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద రోగుల పట్ల నిర్లక్ష్యాన్ని ప్రభుత్వం వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో అవసరమైన ఇంప్లాంట్లు, వైద్య పరికరాలు, సిబ్బందిని సమకూర్చి పేదలకు నాణ్యమైన వైద్యం అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించకపోతే సమస్యను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ దృష్టికి తీసుకెళ్లి, రోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని డప్పు మల్లికార్జున్ మాదిగ హెచ్చరించారు.

# ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



కీసర, సెప్టెంబర్ 7 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం రాంపల్లి గ్రామంలోని స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఎమ్మార్పీఎస్ కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి అభినందించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు బందెల పరమేష్, ఉపాధ్యక్షులు మీసాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి మంచాల నర్సింగరావు, నాయకులు మంచాల మహేందర్, పొడువల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసులతో దద్దరిల్లిన ఏటూర్‌నాగారం ఐటీడీఏ

**తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఐటీడీఏ మార్చ్‌--ముట్టడి హక్కులు, అస్తిత్వ పరిరక్షణ కోసం భారీ నిరసనలో పాల్గొన్న తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ వేలాదిగా తరలివచ్చిన ఆదివాసులు. మార్మోగిన నినాదాలు**





ఏటూర్‌నాగారం, సెప్టెంబర్ 7 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) ఆదివాసుల హక్కులు, అస్తిత్వం, చట్టపరమైన రక్షణలను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఏటూర్‌నాగారం ఐటీడీఏ మార్చ్‌--ముట్టడి కార్యక్రమం భారీగా విజయవంతమైంది. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఏటూర్‌నాగారం ఐటీడీఏ పరిసర ప్రాంతాలు ఆదివాసీ నినాదాలతో మార్మోగాయి. ఉదయం నుంచే వివిధ గ్రామాల నుంచి ఆదివాసులు గుంపులుగా ఏటూర్‌నాగారం చేరుకున్నారు. యువతీ యువకులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ హక్కుల కోసం గళమెత్తారు. సంప్రదాయ పద్ధతిలో నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఐటీడీఏ కార్యాలయం వైపు మార్చ్ నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించి తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

**5వ షెడ్యూల్, పీసా చట్టాల అమలుకు డిమాండ్**

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో రాజ్యాంగం కల్పించిన 5వ షెడ్యూల్ రక్షణలను పటిష్టంగా అమలు చేయాలని, పీసా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి గ్రామసభలకు ఉన్న అధికారాలను కాపాడాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో తీసుకునే నిర్ణయాల్లో స్థానిక ఆదివాసీల అభిప్రాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఆదివాసీ భూములు, అటవీ వనరులు, జల వనరులు, సహజ సంపదపై ఆదివాసీల హక్కులను కాపాడాలని నాయకులు డిమాండ్ చేశారు. రాజ్యాంగం, చట్టాలు ఆదివాసీలకు కల్పించిన రక్షణలను కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు.

**విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించాలి**

ఆదివాసీ యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న విద్యా, వైద్య, రవాణా, ఉపాధి సమస్యలను ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని కోరారు.

గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, ఆసుపత్రులు, రహదారులు తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని అన్నారు. ఆదివాసీ యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో వారికి రాజ్యాంగపరంగా లభిస్తున్న హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

**ఆదివాసీ ప్రాంతాల సమస్యలపై ప్రత్యేక దృష్టి**

ఏటూర్‌నాగారం ఐటీడీఏ పరిధిలోని ఆదివాసీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు, ప్రభుత్వం తక్షణమే గుర్తించి పరిష్కరించాలని తుడుందెబ్బ నాయకులు కోరారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కొరత, విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, ఉపాధి వంటి సమస్యలపై ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు.

ఆదివాసుల హక్కులు, అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంలో ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ఆదివాసీల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో మరింత పెద్దస్థాయిలో ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని నాయకులు హెచ్చరించారు.

**ఐక్యంగా తరలివచ్చిన ఆదివాసులు**

వేలాది మంది ఆదివాసులు ఏటూర్‌నాగారం ఐటీడీఏకు తరలిరావడంతో పరిసర ప్రాంతం మొత్తం జనసంద్రంగా మారింది. ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శాంతియుతంగా నిర్వహించిన మార్చ్‌--ముట్టడి కార్యక్రమం విజయవంతం కావడంతో తుడుందెబ్బ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివాసుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి సంబంధిత నాయకులతో చర్చలు జరిపి పరిష్కార మార్గాలను చూపాలని వారు డిమాండ్ చేశారు. ఆదివాసుల హక్కులు, అస్తిత్వం, రాజ్యాంగ రక్షణల కోసం తమ పోరాటం కొనసాగుతుందని తుడుందెబ్బ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు తుర్సా చంటి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుభద్ర కార్యదర్శి మీచ్చ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలి

**దళిత స్పీకర్‌పై అసభ్య వ్యాఖ్యలకు ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి**
**కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలి: రావుల నాని**



ములుగు సెప్టెంబర్ 7 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) దళితుడైన తెలంగాణ శాసనసభ స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని భద్రాచలం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డివిజన్ చైర్మన్ రావుల నాని అన్నారు. తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయడంతో పాటు, ఆయనపై ఎస్సీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

దళిత స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చేసిన దిగజారుడు వ్యాఖ్యలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని రావుల నాని డిమాండ్ చేశారు. ఒక దళిత స్పీకర్‌ను ఉద్దేశించి తీవ్రమైన పదజాలం ఉపయోగించడం అత్యంత అభ్యంతరకరమని, ఇది కేవలం ఒక వ్యక్తిని అవమానించడం మాత్రమే కాకుండా దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యగా తెలంగాణ సమాజం భావిస్తోందని పేర్కొన్నారు.సభలో ప్రజా సమస్యలపై మాట్లాడే ధైర్యం లేక, తమ నాయకుడు అసెంబ్లీకి హాజరుకాకపోవడంపై సమాధానం చెప్పలేక విషయాన్ని పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్ నాయకులు ఇలాంటి వ్యాఖ్యలు, చర్యలకు పాల్పడుతున్నారని రావుల నాని విమర్శించారు.రాజకీయ భేదాలు ఉండొచ్చని, పరస్పరం విమర్శలు చేసుకోవచ్చని అన్నారు. అయితే స్పీకర్ పదవికి, వ్యక్తిగత గౌరవానికి, దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా అసభ్య పదజాలం ఉపయోగించడం ఏమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు.

తాతా మధు వ్యాఖ్యలపై తెలంగాణ సమాజం ముక్తకంఠంతో ఖండించాలని రావుల నాని కోరారు. దళితుల గౌరవాన్ని కాపాడేందుకు సంబంధిత అధికారులు, ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## సెప్టెంబర్ 11 నుంచి 24 వరకు జిల్లావ్యాప్తంగా ఇంటింటి కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే

**తొలిదశలోనే కుష్టు వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తే అంగవైకల్యాన్ని నివారించవచ్చు**

**జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ**

నిర్భయవార్త ప్రతినిధి విజయవాడ: సెప్టెంబర్ 7, 2026.:జిల్లాలో సెప్టెంబర్ 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటింటి కుష్టు వ్యాధి గుర్తింపు సర్వేకు సంబంధించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మాట్లాడుతూ, "అంగవైకల్యాన్ని నివారించడానికి ముందుగానే కుష్టు వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తాము'' అనే లక్ష్యంతో జిల్లావ్యాప్తంగా రెండు వారాల పాటు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స అందించడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించడంతో పాటు అంగవైకల్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఈ సర్వేకు పూర్తి సహకారం అందించాలని, ఆరోగ్య సిబ్బంది తమ ఇళ్లకు వచ్చినప్పుడు కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను తెలియజేసి పరీక్షలకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. శరీరంపై స్పర్శ తెలియని లేదా స్పర్శ తగ్గిన అనుమానాస్పద మచ్చలు కనిపించినట్లయితే వాటిని నిర్లక్ష్యం చేయకుండా సర్వే బృందానికి తెలియజేసి పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. కుష్టు వ్యాధికి సంబంధించిన లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా వ్యాధి ఇతరులకు వ్యాప్తి చెందకుండా నియంత్రించడంతో పాటు, బాధితులకు సకాలంలో చికిత్స అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. సర్వేలో భాగంగా ఆశా కార్యకర్తలు, ఎంపిక చేసిన పురుష ఆరోగ్య కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి జిల్లాలోని ప్రతి ఇంటినీ సందర్శించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి కుటుంబంలోని సభ్యులను ఆరోగ్య సిబ్బంది పరిశీలించి, కుష్టు వ్యాధికి సంబంధించిన అనుమానాస్పద లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తిస్తారని చెప్పారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఇంటింటి సర్వేలో భాగంగా అనుమానిత కేసులను గుర్తించిన అనంతరం, సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం ద్వారా మరోసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ వివరించారు. వైద్య పరీక్షల్లో కుష్టు వ్యాధి నిర్ధారణ అయిన వారికి వెంటనే మల్టీ డ్రగ్ థెరపీ -- బహుళ ఔషధ చికిత్స అందించనున్నట్లు తెలిపారు. చికిత్సను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. కుష్టు వ్యాధికి సంబంధించిన పరీక్షలు, చికిత్సను ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా అందిస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వ్యక్తులు చికిత్స విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనల మేరకు మందులు వినియోగించాలని సూచించారు. కుష్టు వ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహలు, భయాలను తొలగించి, వ్యాధి లక్షణాలు ఉన్నవారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో నిర్వహించనున్న ఇంటింటి కుష్టు వ్యాధి గుర్తింపు సర్వేను విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య సిబ్బంది తమ ఇళ్లకు వచ్చినప్పుడు కుటుంబ సభ్యులందరూ పరీక్షలకు సహకరించి, అనుమానాస్పద లక్షణాలు ఉంటే ఎటువంటి సంకోచం లేకుండా తెలియజేయాలని సూచించారు. తొలిదశలో వ్యాధిని గుర్తించడం – సకాలంలో చికిత్స అందించడం -- అంగవైకల్యాన్ని నివారించడం అనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో ఈ సర్వేను సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ బి.భాను నాయక్, డీఈఓ ఎల్.చంద్రకళ, పలువురు జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలకు పరిష్కారం..

## ప్రజాసేవకు బీజేపీ కార్యాలయం వేదిక!

## సిద్ధాంతాలతో పాటు సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

## ప్రతి గ్రామం, ప్రతి వార్డులో పార్టీని బలోపేతం చేయాలి.

## సుజనా చౌదరి.





నందిగామ,నిర్భయవార్త ప్రతినిధి :రాజకీయ పార్టీ కార్యాలయం అంటే కేవలం సమావేశాలు, పార్టీ కార్యక్రమాలకు పరిమితమైన ప్రదేశం కాదు.. ప్రజల కష్టాలను వినే వేదిక.. సమస్యలకు పరిష్కారం చూపే కేంద్రం.. ప్రజలకు అండగా నిలిచే సేవా నిలయం కావాలని మాజీ కేంద్ర మంత్రి, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి) అన్నారు.నందిగామ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారతీయ జనతా పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రజా సేవ, పార్టీ నిర్మాణం, క్షేత్రస్థాయి కార్యకలాపాలపై దిశానిర్దేశం చేశారు.ప్రజల మధ్యే కార్యకర్త.. ప్రజాసేవే లక్ష్యంనూతన పార్టీ కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్ర బిందువుగా మారాలని సుజనా చౌదరి ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సేవా భావంతో ప్రజల మధ్య ఉండాలని, వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు.ప్రజలకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉండే నాయకత్వమే ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటుం దని పేర్కొన్నారు. రాజకీయాల్లో పదవులు మాత్రమే లక్ష్యం కాకుండా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలే నిజమైన రాజకీయ నాయకత్వానికి కొలమానం కావాలని అన్నారు. రెండు స్థానాల నుంచి.. దేశంలో అగ్రస్థానానికి1984 లోక్‌సభ ఎన్నికల్లో కేవలం రెండు స్థానాలతో ప్రారంభమైన బీజేపీ.. నేడు దేశ రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతమైన శక్తిగా ఎదగడం వెనుక కార్యకర్తల కఠోర శ్రమ, క్రమశిక్షణ, అంకితభావం ఉన్నాయని సుజనా చౌదరి అన్నారు.ప్రతి కార్యకర్త సేవా గుణంతో పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఒక్కో కార్యకర్త ప్రజలకు చేరువైతే.. ఒక్కో కుటుంబం పార్టీతో అనుసంధానమవు తుందని పేర్కొన్నారు.నందిగామలో సమిష్టి కృషికి ప్రతీక నందిగామ బీజేపీ నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషి, సహకారంతోనే నూతన పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయగలిగామని సుజనా చౌదరి తెలిపారు. ఈ కార్యాలయం నుంచి పార్టీ కార్యకలాపాలతో పాటు ప్రజా సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. విద్య, వైద్య రంగాల్లో అవసరమైన వారికి సుజనా ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. సమాజంలోని అర్హులైన వారికి అండగా నిలవడం ప్రతి ప్రజాప్రతినిధి, కార్యకర్త బాధ్యతగా భావించాలని సూచించారు. ప్రతి గ్రామం.. ప్రతి వార్డు.. బీజేపీ బలోపేతంఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ.. కోట్లాది మంది సభ్యులతో భారతీయ జనతా పార్టీ దేశంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డు స్థాయికి పార్టీని తీసుకెళ్లడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించడంతో పాటు సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలతో బలమైన అనుబంధాన్ని ఏర్పరచుకోవాలని సూచించారు.ప్రజా చైతన్యమే బలమైన మార్పుకు పునాదిప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలను గుర్తించడం, వాటిపై అవగాహన కల్పించడం, పరిష్కారం కోసం ప్రభుత్వ వ్యవస్థలపై బాధ్యతాయుతంగా ఒత్తిడి తీసుకురావడం రాజకీయ పార్టీల సామాజిక బాధ్యత. నందిగామలో ప్రారంభమైన నూతన పార్టీ కార్యాలయం ఈ దిశగా ప్రజలకు అందుబాటులో ఉంటే ప్రజా సమస్యలకు పరిష్కార వేదికగా, యువతకు చైతన్య కేంద్రంగా, సేవా కార్యక్రమా లకు కేంద్ర బిందువుగా నిలిచే అవకాశం ఉంటుంది.ప్రజల సమస్యలు తెలుసుకునే నాయకత్వం.. సమస్యల పరిష్కారం కోసం పనిచేసే కార్యకర్తలు.. అభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం---ఈ మూడు కలిసినప్పుడే నందిగామ సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు ఉన్నం గిరిధర్, పోరుగంటి నరసింహారావు, కొల్లు నాగేశ్వరరావు, బర్రె శివకృష్ణారెడ్డి, సీతారామయ్య, రావూరి రమేష్, బండారు వెంకట నాగ కేదారేశ్వర శర్మ, వివిధ మండలాల అధ్యక్షులు గుత్తా బాలకృష్ణ, మునగంటి కామేశ్వరరావు, మూల వెంకటేశ్వరరావు, కాల్వ మహేష్, గంటా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తుపై సీఐ విజయ్ కుమార్ ఫోకస్.

హుకుంపేట,అల్లూరి జిల్లా, నిర్భయవార్త ప్రతినిధి :.అల్లూరి జిల్లా హుకుంపేట మండల పరిధిలోని తీగలవలస, కామయ్యపేట తదితర గ్రామాల్లో సీఐ విజయ్ కుమార్ నేడు పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల యువత జీవితాలు నాశనం అవుతున్నాయని అన్నారు. కొద్దిపాటి డబ్బుకు ఆశపడి గంజాయి రవాణాకు పాల్పడి పోలీసులకు చిక్కితే కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్తును కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. యువత గంజాయి సాగు, రవాణా, విక్రయాలకు దూరంగా ఉండి ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గ్రామాల్లో ఎవరైనా గంజాయి సాగు, రవాణా లేదా సారా తయారీకి పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అలాగే బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని, పిల్లలను చదివించి మంచి భవిష్యత్తు కల్పించాలని సూచించారు. వాహనాలను అతివేగంగా నడపకుండా, మద్యం సేవించి వాహనాలు నడపకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రజలు పోలీసులకు సహకరించి గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు భాగస్వాములు కావాలని సీఐ విజయ్ కుమార్ కోరారు.




# గిరిజన మహిళపై దాడిని ఖండించిన ఐద్వా.

**బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి.**



హుకుంపేట,అల్లూరి జిల్లా, నిర్భయవార్త ప్రతినిధి :గోల్కొండ మండలం లింగంపేట గ్రామానికి చెందిన గిరిజన మహిళ బొడ్డు అనంతపై అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఆమె ఇంటి వద్దకు వెళ్లి దాడి చేయడాన్ని అల్లూరి జిల్లా గిరిజన మహిళా సంఘం (ఐద్వా అనుబంధం) జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. హైమావతి నేడు పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఈ ప్రకటన ద్వారా ఆమె మాట్లాడుతూ.. గిరిజన మహిళ ఇంటికి వెళ్లి దాడి చేయడం అత్యంత దారుణమని, ఇటువంటి ఘటనలు గిరిజన మహిళల్లో భయాందోళనలు కలిగించేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాడిలో గాయపడిన బొడ్డు అనంత ప్రస్తుతం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు.ఘటనపై పోలీసులు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి దాడికి పాల్పడిన వారిని ఎలాంటి ఆలస్యం లేకుండా అరెస్టు చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని హైమావతి డిమాండ్ చేశారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ఆమె కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం, భద్రత కల్పించాలని కోరారు.గిరిజన మహిళలపై దాడులు, వేధింపులకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు, సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే గిరిజన మహిళా సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఎస్. హైమావతి హెచ్చరించారు.

# పీఓ ఆదిత్య వర్మ గొప్ప ఆలోచన.

**సివిల్స్ లో గిరిజన యువతకు ఉచిత కోచింగ్.**



పాడేరు,అల్లూరి జిల్లా, నిర్భయవార్త ప్రతినిధి :.అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజన యువత సివిల్స్ పరీక్షల్లో రాణించేందుకు ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ చేపట్టిన ఉచిత కోచింగ్ ఎంపిక ప్రక్రియలో భాగంగా నేడు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సివిల్స్ కోచింగ్ పొందేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి గతంలో దరఖాస్తులు స్వీకరించి పరీక్ష నిర్వహించగా, అందులో అర్హత సాధించిన సుమారు 250 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి సివిల్స్ కోచింగ్‌కు పంపించనున్నారు.ఈ సందర్భంగా ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన కుటుంబాలు ఆర్థికంగా వెనుకబడి ఉండటంతో సివిల్స్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షలకు ఖరీదైన కోచింగ్ తీసుకోవడం చాలామంది విద్యార్థులకు సాధ్యం కాదని చదువుకోవాలనే ఆసక్తి, ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారుతున్న విషయాన్ని గుర్తించిన మా ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ ఉచిత సివిల్స్ కోచింగ్ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు.తమపై నమ్మకంతో ఇలాంటి గొప్ప అవకాశాన్ని కల్పించిన ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మకు జీవితాంతం రుణపడి ఉంటామని విద్యార్థులు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి సివిల్స్‌లో మంచి ర్యాంకులు సాధించి ఆయన నమ్మకాన్ని నిలబెడతామని పేర్కొన్నారు. గిరిజన యువతలో సివిల్స్‌పై ఆసక్తిని పెంచడంతో పాటు ఉన్నత ఉద్యోగాల వైపు ప్రోత్సహిస్తున్న ఐటీడీఏ చొరవకు విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అమరోజు గీత చండూరు తల్లి దహన కార్యక్రమం లో పాల్గొన్న వనమాల సునీత దేవి.



నిర్భయవార్త ప్రతినిధి :చండూర్ అంగడి పేట అమరోజు గీతా అమ్మగారు అకాల మరణం చెందినదున కార్యక్రమం లో పాల్గొన్న అల్ ఇండియన్ మ్యారేజ్ బ్యూరోస్ మీడియేటర్స్ వెల్ఫేర్ అశోశేషాన్ జాతీయ అధ్యక్షులు వనమాల సునీత దేవి తన బృందం చే పాల్గని పరామర్శించిన రూ గీత అల్ ఇండియన్ సోసైటీ సీనియర్ ఈ సి. మెంబెర్ కావడం వలన సభ్యులు అందరు వెళ్ళి పాల్గొన్నారు ఈ కార్యక్రమం లో కొల్లి మురళి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డబ్బికర్ రాజా జిల్లా వైస్ ప్రెసిడెంట్ నిరుడు రాజయ్య. జు ఎ మెంబెర్ చండూర్ బైరి బలరాం సీనియర్ జర్నలిస్ట్ సంస్థ సొసైటీ గౌరవ జిల్లా నాయకులు తెలంగాణా ముదిరాజ్ మహా సభ అధికార ప్రతినిధి గీత తోబుట్టువులు బంధువులు అందరూ పాల్గొన్నారు

# తల్లి పుట్టినరోజు నాడు కుమార్తెల ఉదారత.

**నిరుపేదల కొరకు మార్నింగ్ వాక్.**



టెక్కలి, బ.టెక్కలి లో నిరుపేదల సహాయార్థం స్థాపించబడ్డ అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆకలితో అలమటించే ఆసరా లేని కుటుంబాలకు సాయం చేసేందుకు మార్నింగ్ వాక్ ఫర్ పూర్ పీపుల్ కార్యక్రమం ప్రతి నెల నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా టెక్కలి మండలం స్థానిక ఆదిఆంధ్ర వీధిలో నివాసం ఉంటున్న దేవాది మేరీ పుట్టినరోజు సందర్భంగా తన కుమార్తెలు సునీత, అనిత, మమత లు మార్నింగ్ వాక్ ఫర్ పూర్ పీపుల్ కార్యక్రమం ద్వారా ఆసరాలేని కుటుంబాలకు సాయం చేయాలనే ఆలోచనతో మూడు నిరుపేద కుటుంబాలకు నెల రోజులకు సరిపడేలా 25 కేజీల రైస్, నిత్యవసర వస్తువులు, కొంత మొత్తం లో ఆర్థిక సహాయం అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యం లో అందించినట్లు అధ్యక్షులు దేవాది శ్రీనివాస రావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీళ్ళను ఆదర్శం గా తీసుకొని ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ తో ముందుకు వస్తె టెక్కలి నియోజక వర్గంలో చాలామంది పేదల ఆకలి తీర్చవచ్చని కోరారు. ఈ కార్యక్రమంలో అభయం సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాస రావు, సంఘ సభ్యులు యన్ సింహాచలం, అద్దాల వీరభద్రాచారి, ధర్మవరపు పూర్ణాచారి, దేవాది సునీత, దేవాది అనిత లు పాల్గొన్నారు.

# సంగిరెడ్డి రాంరెడ్డి అంతిమ కార్యక్రమం లో పాల్గొన్న వనమాల సునీత దేవి.



నిర్భయవార్త ప్రతినిధి :మిర్యాలగూడ డివిజన్ నివాసి ఆల్ ఇండియన్ మ్యారేజ్ బ్యూరోస్ వెల్ఫేర్ అసోసియేషన్ సీనియర్ జిల్లా కార్యదర్శి జానారెడ్డి అనుచరుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సంగిరెడ్డి రామిరెడ్డి అనారోగ్య కారణం చే ప్రకాష్ ఆల్ ఇండియన్ జిల్లా కమిటీ బృందం చే పరామర్శించి వనమాల సునీత దేవి మరియు బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షులు,,,ఓదార్చారు సంగిరెడ్డి పద్మా రామిరెడ్డి చర్చికి వెళ్లే సహవాసం అగ్ని మినిస్ట్రీ వారాహి సుదర్శన్ పాస్టర్ అధిక సంఖ్యలో పాల్గొని పాటలు ప్రార్థనలు వారి స్వయంగా నిర్వహించారు చక్రి నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భోజన ఏర్పాటు చూసారు, నూకల వేణుగోపాల్ రెడ్డి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధక్షులు మరియు తలకొప్పుల సైదులు బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్. శ్యామల నసేన రెడ్డి సంస్థ అధ్యక్షులు ఫోన్ ద్వారా పాలకరించారు రాంరెడ్డి మ్యారేజ్ బ్యూరో చేస్తూ గతం లో రైస్ మిల్లు సొంతంగా నడుపుతూ రాజకీయం గా 40ఇయర్స్ క్రితం జానారెడ్డి తో కల్గి యున్న అనుభవల ను నిడమానూరు నార్మమ్మగూడెమ్. తుమ్మడం గ్రామ ప్రజల సంబంధం లా ను గుర్తుకు చేసుకున్నారు రాంరెడ్డి కుటుంబ సభ్యులు సుదర్శన్ పాస్టర్ చర్చి సభ్యులు నార్మ్మగూడెయం గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మరియు కొల్లి మురళి అల్ ఇండియా న్ సోసైటీ ప్రధాన కార్యదర్శి కుందుర్ జయ వీరు యూవసేన జిల్లా అధ్యక్షులు పెద్ద దేవుల పెల్లి గ్రామ మ్. మరియు డబ్బికర్ రాజా. నల్లగొండ పాతబస్తీ బిజెపి కాంటెస్ట్ కార్పొరేటర్. అల్ ఇండియన్ సోసైటీ నల్లగొండ వైస్ ప్రెసిడెంట్. పాల్వాయి పద్మ సీతారాం పురం. మిరియాల గూడా టావోన్ సోసైటీ ప్రెసిడెంట్ మరియు. నల్లగొండ రమేష్ నేత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ కోఆర్డినేటర్ మరియు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చేనేత సెల్ చైర్మన్ పాల్గొన్నారు.

# ప్రైవేట్ ట్రావెల్ బస్సులపై ఎంవీఐ ప్రసన్న కుమారి తనిఖీలు.




బాపట్ల,నిర్భయవార్త ప్రతినిధి :ాపట్టణంలో ప్రైవేట్ ట్రావెల్ బస్సులను ఎంవీఐ ప్రసన్న కుమారి తనిఖీ చేశారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బస్సుల ఫిట్‌నెస్, పర్మిట్లు, ఇతర రవాణా నిబంధనలను పరిశీలించారు.అలాగే బస్సు డ్రైవర్లను తనిఖీ చేస్తూ మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారా లేదా అనే అంశాన్ని కూడా పరిశీలించారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, మద్యం సేవించి డ్రైవింగ్‌కు పాల్పడవద్దని సూచించారు.ప్రయాణికుల భద్రతే ప్రధాన లక్ష్యంగా ప్రతి వాహనం నిబంధనల ప్రకారం ఫిట్‌నెస్ కలిగి ఉండాలని, డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని ఎంవీఐ ప్రసన్న కుమారి అవగాహన కల్పించారు.

# సినిమాస్కోప్

## బాహుబలి 2- RRR క్రేజ్‌తో తెలుగు రాష్ట్రాల్లో 'వారణాసి' ప్రీ-బిజినెస్ హవా!

అయితే ఇప్పుడు -వారణాసి- చిత్రం ఈ రెండు ఇండస్ట్రీ హిట్లను వెనక్కి నెట్టి.. ప్రీబిజ్‌లో ఎవరూ ఊహించని



మైలురాయిని తాకనుందని ట్రేడ్ వర్గాల్లో గుసగుస వినిపిస్తోంది.తెలుగు చిత్రసీమ స్థాయిని అంతర్జాతీయ వేదికపై నిలబెట్టిన దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి- సూపర్‌స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న -వారణాసి- చిత్రం బాక్సాఫీస్ రికార్డులను సృష్టించక ముందే ప్రీ-రిలీజ్ బిజినెస్‌లో సరికొత్త చరిత్రకు శ్రీకారం చుడుతోంది. గతంలో రాజమౌళి తెరకెక్కించిన -బాహుబలి 2- చిత్రం తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 122 కోట్ల థియేట్రికల్ బిజినెస్ చేయగా.. ఆ తర్వాత వచ్చిన -ఆర్‌ఆర్‌ఆర్- (RRR) చిత్రం రెండు తెలుగు రాష్ట్రాల్లో (ఆ్రా ఢ యా) ఏకంగా 230 కోట్ల మేర ప్రీ-రిలీజ్ బిజినెస్ సాధించి రికార్డు నెలకొల్పింది. అయితే ఇప్పుడు -వారణాసి- చిత్రం ఈ రెండు ఇండస్ట్రీ హిట్లను వెనక్కి నెట్టి.. ప్రీబిజ్‌లో ఎవరూ ఊహించని మైలురాయిని తాకనుందని ట్రేడ్ వర్గాల్లో గుసగుస వినిపిస్తోంది. ప్రస్తుతం ఫిలిం నగర్ వర్గాల విశ్లేషణల ప్రకారం.. -వారణాసి- సినిమా కేవలం ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ థియేట్రికల్ హక్కుల రూపంలోనే ఏకంగా 320 కోట్లకు పైగా ప్రీ-రిలీజ్ బిజినెస్ జరుపుకుంటున్నట్లు తెలుస్తోంది. -బాహుబలి 2- బిజినెస్‌తో పోలిస్తే ఇది దాదాపు మూడు రెట్లు కాగా, -ఆర్‌ఆర్‌ఆర్- ప్రీ-రిలీజ్ బిజినెస్ కంటే దాదాపు 90 కోట్లు అధికం. తెలుగు సినిమా చరిత్రలోనే కేవలం ఒక ప్రాంతీయ మార్కెట్ నుండి ఈ స్థాయిలో 300 కోట్ల మార్కును దాటి థియేట్రికల్ బిజినెస్ జరగడం నిజంగా ఒక అసాధారణమైన సంచలనంగా విశ్లేషిస్తున్నారు. ఇది రాజమౌళి బ్రాండ్ వాల్యూకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ స్థాయిలో ప్రీ-రిలీజ్ బిజినెస్ హైప్ పెరగడానికి ప్రధాన కారణం మూవీకి ఎంచుకున్న భారీ బడ్జెట్- యూనివర్శల్ కాన్సెప్ట్. దాదాపు 1300 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్ట్‌ను గ్లోబల్ అప్పీల్ ఉన్న కథాంశంతో తెరకెక్కిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 30కి పైగా భాషల్లో.. 120కి పైగా దేశాల్లో ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. -ఆర్‌ఆర్‌ఆర్- ఆస్కార్ విజయం తర్వాత రాజమౌళికి అంతర్జాతీయంగా లభించిన గుర్తింపు.. మహేష్ బాబు మార్కెట్ స్టామినా కలవడంతో డిస్ట్రిబ్యూటర్లు ఈ చిత్రంపై ఇంతటి భారీ మొత్తాన్ని వెచ్చించడానికి సిద్ధపడతున్నారు. పాత్రల పరంగానూ -వారణాసి- ప్రేక్షకుల్లో గొప్ప ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రంలో మహేష్ బాబు రుద్ర, పురాణ పురుషుడు శ్రీరాముడుగా.. రెండు విభిన్నమైన పవర్ ఫుల్ పాత్రల్లో ద్విపాత్రాభినయం చేస్తుండటం గమనార్హం. మహేష్ సరసన గ్లోబల్ నటి ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తుండగా.. మలయాళ సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ పవర్‌ఫుల్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి స్వరాలు సమకూరుస్తుండటం.. కే.ఎల్. నారాయణ - ఎస్.ఎస్. కార్తికేయలు సంయుక్తంగా నిర్మిస్తుండటం ఈ ప్రాజెక్ట్ రేంజ్‌ను మరింత పెంచాయి. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశకు చేరుకున్న ఈ సినిమా బ్యాలెన్స్ 80 రోజుల టాకీ పార్ట్‌ను వేగంగా పూర్తి చేసుకుని, వచ్చే ఏడాది ఏప్రిల్‌లో విడుదల కానుంది. ఆర్‌ఆర్‌ఆర్, పుష్ప 2 చిత్రాలు నెలకొల్పిన బాక్సాఫీస్ రికార్డులు.. ప్రీబిజ్ రికార్డులను తిరగరాసే దిశగా -వారణాసి- అడుగులు వేస్తోందనే సమాచారం ఉత్కంఠకు గురి చేస్తోంద. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే 320 కోట్ల బిజినెస్ లెక్కలు దాటిన ఈ పాన్-వరల్డ్ చిత్రం... థియేటర్లలోకి వచ్చాక బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టిస్తుందోనని ప్రపంచ వ్యాప్తంగా సినీ ప్రియులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

## ఇంట్రెస్టింగ్ సందీప్ వంగా కళ్లు విక్రమ్ వైపా?

ప్రస్తుతం భారతీయ చిత్రసీమలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా క్రేజ్ ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రస్తుతం భారతీయ చిత్రసీమలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా క్రేజ్ ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. -అర్జున్ రెడ్డి-, -కబీర్ సింగ్-, -యానిమల్- వంటి సంచలన విజయాల తర్వాత బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు స్టార్ హీరోలందరూ సందీప్‌తో సినిమాలు చేయడానికి ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే అందరూ సందీప్ వంగా కాల్‌షీట్ల కోసం వేచి చూస్తుంటే? ఆయన చూపు మాత్రం తమిళ విలక్షణ నటుడు చియాన్ విక్రమ్ వైపు మళ్లిందనే వార్త ఫిల్మ్ నగర్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.ప్రస్తుతం సందీప్ రెడ్డి వంగా యంగ్ రెబెల్ స్టార్ ప్రభాస్‌తో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న -స్పిరిట్- సినిమా చిత్రీకరణలో బిజీగా ఉన్నారు. ఈ పవర్ ఫుల్ కాప్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే అంచనాలు ఆకాశాన్నంటు తున్నాయి. ఈ సినిమా పనుల్లో నిమగ్నమై ఉన్నా? సందీప్ తదుపరి ప్రాజెక్ట్‌లకు సంబంధించి విలక్షణ ఆలోచనలతో ముందుకు సాగుతున్నారని.. అందులో భాగమే విక్రమ్‌తో సినిమా ఆలోచన అని తెలుస్తోంది. విక్రమ్ నటన, పాత్రల కోసం పడే కష్టం, మేకోవర్ విషయంలో చూపించే డెడికేషన్ పట్ల సందీప్ వంగాకు ఎంతో గౌరవం ఉందని ఆయన సన్నిహితులు ఎప్పుడూ చెబుతుంటారు. కథలో ఇంటెన్సిటీని, గ్రే షేడ్స్ ఉన్న రోల్స్‌ను విక్రమ్‌లాంటి నటుడు స్క్రీన్ పైకి తెస్తే ఆ మేజిక్ వేరే లెవెల్‌లో ఉంటుందని సందీప్ భావిస్తున్నారట. గతంలో -అర్జున్ రెడ్డి- తమిళ రీమేక్ (ఆదిత్య వర్మ) ద్వారా విక్రమ్ కుమారుడు ధృవ్ విక్రమ్‌తో కూడా సందీప్ టీమ్‌కు మంచి అనుబంధం ఏర్పడింది. హీరో క్యారెక్టరైజేషన్‌ను ఇంటెన్స్‌గా, రా అండ్ రస్టిక్ కోణంలో డిజైన్ చేయడం సందీప్ రెడ్డి వంగా ప్రత్యేకత. -సేతు-, -అపరిచితుడు-, -పితామగన్- వంటి చిత్రాలతో నటనలో సరికొత్త ప్రమాణాలను నెలకొల్పిన విక్రమ్‌కు అలాంటి పవర్‌ఫుల్ రోల్స్ కొత్తేమీ కాదు. ఎలాంటి పాత్రకైనా వన్నె తేగల గ్రేట్ యాక్టర్ అతడు. ఈ నేపథ్యంలో సందీప్ -విక్మ్ చేతులు కలిపితే అది సంచలనమే అవుతుంది. ఇద్దరి మేకింగ్ అండ్ యాక్టింగ్ స్టైల్స్ సింక్ అయితే వెండితెరపై మరో ఐకానిక్ క్యారెక్టర్ ఆవిష్కృతమవ్వడం ఖాయం. అయితే ఈ ప్రాజెక్ట్ ఇప్పుడే పట్టాలెక్కదు. ప్రస్తుతం -స్పిరిట్- షూటింగ్‌ను వేగవంతంగా పూర్తి చేయడంలో సందీప్ నిమగ్నమై ఉన్నారు. అటుపై రణ్‌బీర్ కపూర్‌తో -యానిమల్ పార్క్- కూడా చేయాల్సి ఉంది. ఈ రెండు పూర్తి చేయడానికే సందీప్ చాలా సమయం తీసుకుంటాడు. ఆ తర్వాత విక్రమ్ ప్రాజెక్ట్ పై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టగలరు. మోస్ట్ క్రేజీ కాంబినేషన్ నిజంగానే కార్యరూపం దాల్చితే అది సౌత్ సినిమాలోనే కాదు పాన్-ఇండియా వ్యాప్తంగా పెద్ద సంచలనం అవుతుంది.



## అమ్మానాన్నకు చెప్పలేనివి సుమంత్ బ్రోకే చెబుతాను: అఖిల్

చిన్నప్పటి నుంచి సుమంత్ ఒడిలోనే పెరిగానని తెలిపిన అఖిల్.. తన జీవితంలో సుమంత్‌కు ఉన్న స్థానం ప్రత్యేకమైనదని చెప్పారు.అక్కినేని కాంపౌండ్ నుంచి వస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం -మహేంద్రగిరి వారాహి- ప్రీ-రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్ లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యువ హీరో అక్కినేని అఖిల్, వేదికపై మాట్లాడిన మాటలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. సుమంత్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ థ్రిల్లర్ మూవీ వేడుకలో అఖిల్ ప్రసంగిస్తూ.. తన అన్న సుమంత్‌తో ఉన్న ప్రత్యేకమైన అనుబంధాన్ని, కుటుంబ బంధాల ప్రాముఖ్యతను గుర్తు చేసుకుంటూ ఎంతో భావోద్వేగానికి లోనయ్యారు. చిన్నప్పటి నుంచి సుమంత్ ఒడిలోనే పెరిగానని తెలిపిన అఖిల్.. తన జీవితంలో సుమంత్‌కు ఉన్న స్థానం ప్రత్యేకమైనదని చెప్పారు. ఇంట్లో అమ్మానాన్నలకు చెప్పలేని విషయాలు లేదా అడగలేని సహాయం ఏదైనా ఉంటే, తను మొదట ఫోన్ చేసేది సుమంత్ బ్రోకేనని వివరించారు. ఏ అవసరం వచ్చినా ఎప్పుడూ కాదనకుండా తనకు అండగా నిలిచారని... ఈ రోజు ఆయన సినిమా వేడుకకు రావడం తనకు ఎంతో సంతోషాన్ని.. నేరుగా హృదయానికి తాకే పాజిటివ్ అనుభూతిని ఇచ్చిందని చెప్పారు. ఈ సందర్భంగా సినిమా మేకర్లను అఖిల్ ప్రత్యేకంగా అభినందించారు. మధు- లక్ష్మణ్ కాంబినేషన్‌లో కంటెంట్‌ను నమ్మి పూర్తి స్థాయిలో థియేటర్లకు తీసుకొచ్చే విధానాన్ని ప్రశంసిస్తూ.. పరిశ్రమకు ఇలాంటి ధైర్యవంతులైన నిర్మాతలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. అలాగే ఈ వేడుకకు విచ్చేసిన -స్టార్ బాయ్- సిద్ధు జొన్నలగడ్డను అభినందిస్తూ.. వరుస హిట్లతో బిజీగా ఉన్నా ఒక జెన్యూన్ కంటెంట్ ఉన్న సినిమాను సపోర్ట్ చేయడానికి సిద్ధు రావడం చాలా గొప్ప విషయమని కొనియాడారు.దర్శకుడు సంతోష్ మేకింగ్ గురించి మాట్లాడుతూ.. ఆయన ఎంతో ఓపికతో.. ప్రాణం పెట్టి ఈ చిత్రాన్ని తెరకెక్కించారని ప్రశంసించారు. ఇది నేటి తరం ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చే -టుడేస్ సినిమా- అని.. సినిమాలో ఒక రకమైన దైవిక శక్తి (డివైన్ పవర్) కనిపిస్తోందని అఖిల్ అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా.. యాంకర్ సుమ అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కచ్చితంగా పెద్ద హిట్ అవుతుందనే ధీమాను, ప్రెడిక్షన్‌ను బహిర్గతం చేశారు. అక్కినేని కుటుంబానికి -మనం-, తనకు -హాలో- లాంటి మర్చిపోలేని మ్యూజికల్ హిట్లు ఇచ్చిన సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ అందించిన ఆర్‌ఆర్, పాటల ఎనర్జీపై ప్రశంసలు కురిపించారు. సెప్టెంబర్ 11న థియేటర్లలో విడుదలవుతున్న ఈ చిత్రాన్ని అందరూ చూసి ఆదరించాలని కోరిన అఖిల్.. సినిమా సక్సెస్ మీట్‌కు కూడా నన్ను కచ్చితంగా పిలవాలని.. నేను మళ్లీ వస్తానని చిరునవ్వుతో కోరారు. ఇక ఈ వేదికపై సుమంత్, స్టార్ బోయ్ సిద్ధూ సహా అథితులు ఇటీవలి బ్లాక్ బస్టర్ లెనిన్ చిత్రంలో అఖిల్ నటనపై ప్రశంసలు కురిపించడం విశేషం.



## ఎన్నికల విజయం వెనుక బండ్ల గణేష్

రెండున్నరేళ్ల క్రితమే రండి కూర్చుందాం, ఎవరి సమస్యలున్నా మాట్లాడుకుందాం అని పిలిచినా ఎవరూ ముందుకు రాలేదని గుర్తు చేశారు. ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికల పోరు ముగిసింది, రిజల్ట్స్ వచ్చేశాయి. ఊహించినట్టే సీనియర్ ప్రొడ్యూసర్ సి. కళ్యాణ్ ప్యానెల్ భారీ మెజారిటీతో క్లీన్ స్వీప్ చేసి సత్తా చాటింది. ఫలితాలు వచ్చిన వెంటనే మీడియా ముందుకు వచ్చిన సి. కళ్యాణ్, తనదైన స్టైల్లో ప్రత్యర్థులకు గట్టి కౌంటర్లు ఇస్తూనే తెరవెనుక అసలైన గేమ్ ఛేంజర్ గురించి ఓపెన్ అయిపోయారు. ఈ గెలుపు సంబరాల్లో ఆయన నోటి నుంచి వచ్చిన ఒక పేరు ఇప్పుడు టాలీవుడ్ సర్కిల్స్‌లో ఫుల్ వైరల్ అవుతోంది. నేను ఈ రోజు ప్రెసిడెంట్‌గా ఇంత హ్యాపీగా ఉండటానికి, ఈ స్థాయి విక్టరీ కొట్టడానికి కారణం నా తమ్ముడు బండ్ల గణేష్ అంటూ సి. కళ్యాణ్ బ్లాస్టింగ్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఎన్నికల వేళ బండ్ల గణేష్ బ్యాక్ ఎండ్‌లో నడిపించిన స్ట్రాటజీ, అందించిన సపోర్ట్ వల్లే తాను ఈ కుర్చీలో కూర్చున్నానని చెప్పకనే చెప్పేసి అందరికీ పెద్ద షాక్ ఇచ్చారు. గతంలో తన మాట వినని ప్రత్యర్థులపై సి. కళ్యాణ్ అదిరిపోయే సెటైర్లు వేశారు. రెండున్నరేళ్ల క్రితమే రండి కూర్చుందాం, ఎవరి సమస్యలున్నా మాట్లాడు కుందాం అని పిలిచినా ఎవరూ ముందుకు రాలేదని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ గెలిచి కూర్చున్నాం, ఇప్పటికైనా ఈగోలు పక్కన పెట్టి రండి కలిసి పనిచేద్దాం అంటూ ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. పరిశ్రమ బాగుండాలంటే అందరూ కలిసి రావాలని, గెలిచిన వాళ్లం మేము పిలుస్తున్నాం కాబట్టి అవకాశాన్ని వాడుకోవాలని హితవు పలికారు. ఇండస్ట్రీలో అత్యంత దయనీయంగా మారిన చిన్న నిర్మాతల ఇష్యూపై సి. కళ్యాణ్ సీరియస్ అయ్యారు. సొంత డబ్బులు తెచ్చి కష్టపడి ప్రాజెక్ట్ తీస్తే, థియేటర్లలో రిలీజ్ చేసుకునేందుకు చిన్న ప్రొడ్యూసర్లు నానా పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిని చేతులు పట్టుకుని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు. ఏదో మాటలు చెప్పి వదిలేయకుండా, కేవలం 15 రోజుల్లోనే ఒక పక్కా యాక్షన్ ప్లాన్ రెడీ చేసి ప్రెస్ మీట్ పెట్టి అన్నీ బయటపెడతామని స్పష్టం చేశారు. తన ప్యానెల్ సాధించిన ఓట్ల రికార్డుల గురించి ఆయన లెక్కలతో సహా వివరించారు. వైస్ ప్రెసిడెంట్స్ విభాగంలో మోహన్ వడ్లపట్ల 338 ఓట్లతో టాప్‌లో నిలిస్తే, దామోదర ప్రసాద్ 274 ఓట్లతో నెగ్గారన్నారు. కనీసం ప్రచారానికి కూడా రాలేకపోయిన జీవితా రాజశేఖర్‌కు 267 ఓట్లు పడ్డాయంటే తమ ప్యానెల్ పవర్ ఏంటో అర్థం చేసుకోవచ్చని ఎద్దేవా చేశారు. ట్రెజరర్‌గా చెదలవాడ శ్రీనివాసరావు 383 ఓట్లు సాధించి ప్రత్యర్థులను దరిదాపుల్లోకి కూడా రానివ్వకుండా చితక్కొట్టారని చెప్పారు. జాయింట్ సెక్రటరీలుగా అమ్మిరాజు కానుమల్లికి 416 ఓట్లు, రామ సత్యనారాయణకు 398 ఓట్లు వచ్చాయని, అసలు సినిమా ఇక్కడే ఉందని చెబుతూ పద్మిని నాగులపల్లికి ఏకంగా 426 ఓట్లు పడ్డాయని గుర్తు చేశారు. ఛాంబర్ రికార్డుల్లో చాలామంది మెంబర్ల ఫోన్ నంబర్లు తప్పుగా ఉన్నాయని, వెంటనే వచ్చి డేటా కరెక్ట్ చేయించుకుంటే వాళ్లకు సేవ చేయడానికి తమకు ఈజీ అవుతుందని సి. కళ్యాణ్ పేర్కొన్నారు.

## 'జైలర్ 2' రీషూట్స్ - వివాదాలకు చెక్!

సూపర్ స్టార్ రజనీకాంత్- నెల్సన్ దిలీప్‌కుమార్ కాంబినేషన్‌లో -జైలర్- చిత్రానికి సీక్వెల్‌గా -జైలర్ 2- తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు ఇంట్రెస్టింగ్ విషయం వెలుగులోకి వచ్చింది.కొన్ని సన్నివేశాలు సున్నితమైన రాజకీయ అంశాలతో కూడి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. తమిళనాడులోని రాజకీయ పరిస్థితులు ..సామాజిక వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ఏ వర్గానికి లేదా రాజకీయ కోణానికి ఇబ్బంది కలగకుండా ఉండేందుకే మేకర్స్ కొన్ని సన్నివేశాలను రీషూట్ చేస్తున్నట్లు సమాచారం.రజనీకాంత్ ప్రతిష్టకు, సినిమా రన్‌కు ఎలాంటి అడ్డంకులు రాకూడదనే ఉద్దేశంతోనే వివాదాస్పదంగా మారే అవకాశమున్న సీన్లకు కత్తెర వేసి.. కొత్త సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు కోలీవుడ్ మీడియాలో ప్రచారం జరుగు తోంది. -జైలర్- భారీ విజయం సాధించిన నేపథ్యంలో -జైలర్ 2- పై దేశ వ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా పాన్-ఇండియా రేంజ్‌లో అందరినీ అలరించేలా కథనాన్ని మలచడం నెల్సన్‌కు సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో రాజకీయం లేదా సున్నిత విషయాల జోలికి వెళ్లకుండా పక్కా యాక్షన్ ఎంటర్ టైన్‌మెంట్ కాన్సెప్ట్‌కే పెద్దపీట వేసేందుకు రీషూట్‌ల ద్వారా స్క్రిప్ట్‌లో కొన్ని కీలక మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రజనీకాంత్ -ధర్మన్-షూటింగ్ లో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆ సినిమా షూటింగ్ కు హాజరవుతూనే రీ షూట్ పాల్గొనాల్సి ఉంటుంది. అయితే వివాదాస్పద సన్నివేశాలు ప్రత్యేకంగా ఎవరి పై షూట్ చేయాలి? అన్న దానిపై సరైన క్లారిటీ రావాల్సి ఉందిసీక్వెల్‌ను మరింత గ్రాండ్‌గా తీర్చిదిద్దేందుకు సాంకేతిక బృందంతో పాటు విలక్షణమైన నటీనటులను రంగంలోకి దించుతున్నారు. అనిరుధ్ రవిచందర్ మళ్లీ తన మార్క్ పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో రజనీ పాత్రను ఎలివేట్ చేయడానికి సిద్ధమవుతున్నాడు. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తొలి భాగాన్ని మించి ఉంటుందని సన్నిహితులు అంటు న్నారు. అలాగే సినిమాలో



మలయాళ బ్యూటీ అన్నా రేష్మా రాజన్ లేడీ విలన్‌గా నటించడం సినిమాకు అదనపు అస్సెట్ గా కలిసొస్తుంది. మరోవైపు బాలీవుడ్ హంక్ హృతిక్ రోషన్ చిత్రంలో అద్భుతమైన క్యామియో చేయను న్నారనే ప్రచారం సినిమాపై క్రేజ్‌ను రెట్టింపు చేస్తుంది. రజనీకాంత్ మాస్ ఇమేజ్‌కు, హృతిక్ రోషన్ స్టైలిష్ స్క్రీన్ ప్రెజెన్స్ తోడైతే థియేటర్లలో పూనకాలు రావడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇలాంటి సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్ అన్నీ -జైలర్ 2- పై అంచనాలను అంతకంతకు పెంచుతున్నాయి.



Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197